www.vaarthavedhikasurya.com
PRGI.NO:- TGTEL/25/A0305
# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి YADADRI BHUVANAGIRI | సంపుటి: 2 VOLUME : 2 | సంచిక: 12 ISSUE : 12 | సోమవారం, 1 జూన్, 2026 MONDAY, JUNE 1, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి EDITOR : POLOJU SRINIVASA CHARY | పేజీలు: 8 PAGES : 8 | వెల: 5-00 RS : 5-00 |
|---|---|---|---|---|---|---|

## ఉద్యోగులకు హెల్త్ స్కీమ్.. ఈ నెల నుంచే!

- నేడు ఈహెచ్ఎస్‌పై సీఎం సమీక్ష
- ఎంప్లాయీస్ హెల్త్‌కేర్ ట్రస్ట్ కమిటీని ప్రకటించే చాన్స్.. మార్గదర్శకాలు కూడా..
- రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున 50 మంది ఉద్యోగులకు కొత్త కార్డులు!
- 7.5 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలకు ప్రయోజనం
- నేడు సీఎస్‌తో ఉద్యోగ సంఘాల భేటీ

2

## నేడు కుమరంభీం జిల్లాకు ముఖ్యమంత్రి

- కొత్తగూడలో 25 ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం..
- రెండో విడత ఇందిరమ్మ ఇళ్లూ మంజూరు
- ఖర్గేను కలిసిన సీఎం, డిప్యూటీ సీఎం
- ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో దేశంలోనే నంబర్1



హైదరాబాద్/ఆసిఫాబాద్/శంషాబాద్, (వార్త వేదిక సూర్య)-మే31:

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. జిల్లాలో సుమారు రూ.112.14 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. కెరిమెరి మండలం కొఠారి పంచాయతీ పరిధిలోని కొత్తగూడలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించనున్నారు. కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. మిగతా 2లో..

## నా పుట్టుక.. ప్రయాణం బీఆర్ఎస్‌తోనే..

- రేవంత్ లెక్క పూటకోపార్టీ మారిన చరిత్ర కాదు నాది
- 'రైతు డిస్కమ్'తో తెలంగాణ వ్యవసాయానికి ఉరితాడు
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్



సిద్దిపేట, (వార్త వేదిక సూర్య)-మే31:

తాను బీఆర్ఎస్‌లోనే రాజకీయ ప్రస్థానం ప్రారంభించానని, ఇకపై తన ప్రయాణమంతా కేసీఆర్‌తోనే కొనసాగుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ విషయం వందసార్లు చెప్పానని, ఇంకా ఎన్నిసార్లయినా ఇదే మాట చెబుతానని అన్నారు. ఆదివారం సిద్దిపేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన గురించి మాట్లాడే నైతిక హక్కు సీఎం రేవంత్‌రెడ్డికి లేదని అన్నారు. పూటకో పార్టీ మారినట్లు నాలుగు పార్టీలు తిరిగిన చరిత్ర ఆయనకే ఉందని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అబద్ధాలు అయినట్లుగానే, తన గురించి మాట్లాడిన ప్రతీ మాట కూడా పచ్చి అబద్ధమని అన్నారు. రేవంత్ తన ఇంటిపేరును ఎనుములకు బదులుగా అబద్ధాల రేవంత్‌గా మార్చుకోవాలని సూచించారు. రైతులకు 24 గంటలపాటు ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి, ఆర్పీడీసీఎల్ డిస్కంను ఏర్పాటు చేయడం సీఎం రేవంత్ తీసుకున్న తుగ్లక్ నిర్ణయమని విమర్శించారు. రైతు డిస్కం పరిధిలోకి లిఫ్ట్ ఇరిగేషన్, మిషన్ భగీరథ, సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులను తేవడం రాష్ట్ర వ్యవసాయానికి పెద్ద శాపమని అన్నారు. తెలంగాణ మిగతా 2లో..



## బెంగళూరుదే ఐపీఎల్ ట్రోఫీ

- వరుసగా రెండో టైటిల్ సొంతం
- ఫైనల్లో గుజరాత్‌పై ఘనవిజయం
- అదరగొట్టిన విరాట్ కోహ్లీ

అహ్మదాబాద్: ఐపీఎల్-19వ సీజన్‌లోనూ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు విజేతగా నిలిచింది. ఆదివారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఏకపక్ష ఫైనల్లో ఆర్సీబీ 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. విరాట్ కోహ్లీ (42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 75 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఆర్సీబీకిది వరుసగా రెండో టైటిల్ కాగా.. అటు 2022లో తొలిసారి విజేతగా నిలిచిన గుజరాత్ ఫైనల్లో ఓడడం ఇది రెండోసారి. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 155 పరుగులు చేసింది. సుందర్ (37 బంతుల్లో 5 ఫోర్లతో 50 నాటౌట్), నిశాంత్ (18 బంతుల్లో 3 ఫోర్లతో 20), బట్లర్ (23 బంతుల్లో 1 ఫోర్‌తో 19) మాత్రమే రాణించారు. రసిఖ్‌కు మూడు.. భువనేశ్వర్, హాజెల్‌వుడ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో బెంగళూరు 18 ఓవర్లలో 5 వికెట్లకు 161 పరుగులు చేసి గెలిచింది. వెంకటేశ్ అయ్యర్ (16 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 32), డేవిడ్ (17 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 24) వేగం చూపారు. రషీద్‌కు రెండు వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా విరాట్ కోహ్లీ, 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా వైభవ్ సూర్యవంశీ మిగతా 2లో..









సంపుటి: 2 సంచిక: 12 వార్త వేదిక సూర్య సోమవారం, 1 జూన్, 2026

# ఉద్యోగులకు హెల్త్ స్కీమ్.. ఈ నెల నుంచే!

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మే31:

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు సంబంధించిన కొత్త ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) ఈ నెల నుంచే అమల్లోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. దీనికి సంబంధించిన కసరత్తు ఇప్పటికే ఓ కొలిక్కి వచ్చినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ పథకానికి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ఈ పథకం అమలుకానున్న నేపథ్యంలో.. ట్రస్టు కమిటీని సోమవారమే ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. పథకం మార్గదర్శకాలు కూడా విడుదల చేయవచ్చని తెలిసింది. ఉద్యోగ సంఘాల నుంచి ఆరుగురు, పెన్షనర్ల నుంచి ఇద్దరు ప్రతినిధులు ఈ ట్రస్ట్ సభ్యులుగా ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి ఒకరిని ట్రస్ట్‌కు సీఈ వోగా నియమిస్తారు. ఇక ఈహెచ్‌ఎస్‌పై సీఎం సమీక్ష నేపథ్యంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో ఉద్యోగ సంఘాల నేతలతో సీఎస్ రామకృష్ణారావు సమావేశం కానున్నారు.

**అవతరణ వేడుకల్లో 50 మందికి కార్డులు!**

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 2న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగులకు కొత్త ఈహెచ్ఎస్ కార్డుల పంపిణీని ప్రారంభించనున్నట్టు సమాచారం. పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కార్యక్రమం వేదికపై 50 మంది ఉద్యోగులకు ఈహెచ్ఎస్ కార్డులు అందజేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఆ రోజున సాధ్యం కాకపోతే ఈ నెల 10లోపు కార్డుల పంపిణీ మొదలవుతుందని వెల్లడించాయి. కొత్త ఈహెచ్ఎస్ అమలుకు అవసరమైన వివరాల సేకరణ ఇప్పటికే మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యుల వివరాలన్నీ క్రోడీకరించడంపై ఆర్థిక శాఖ దృష్టిపెట్టింది. మే 31లోపు వివరాలన్నీ అప్‌లోడ్ చేయాలని గతంలోనే అన్నిశాఖలకు సర్క్యులర్ జారీ చేసింది. ఆ కసరత్తు ఓ కొలిక్కి వచ్చినట్టు సమాచారం. ఈ వివరాల ఆధారంగానే ఈహెచ్ఎస్ డిజిటల్ హెల్త్ కార్డులు, క్యాష్‌లెస్ చికిత్స సేవలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. రాష్ట్రంలో 7.5 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు దీనితో లబ్ధిపొందనున్నట్టు అంచనా.

**జీతాల్లో వాటా ఇప్పటికే కట్!**

కొత్త ఈహెచ్ఎస్ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రతినెలా తమ వేతనాల బేసిక్ పేలో 1.5శాతాన్ని వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. మే నెల వేతనంలో ఈ మేరకు వాటాను ఆర్థిక శాఖ కట్ చేసింది. అయితే ఈహెచ్ఎస్ అమలు, ఎంప్యానెల్ చేసిన ఆస్పత్రులు, అర్హత ప్రమాణాలు, చికిత్స ప్యాకేజీలపై మార్గదర్శకాలు విడుదల చేయకుండానే జీతాల్లో కోత ఎలా పెడతారని కొందరు ఉద్యోగుల నుంచి ప్రశ్నలు వస్తున్నాయి. తొలుత వేతనాల్లో కోతపెట్టి, పథకం ట్రస్టులో సొమ్మును జమ చేశాకే స్కీమ్ అమలు ప్రారంభం అవుతుందని ఉద్యోగ సంఘాల నేతలు వివరిస్తున్నారు.

**చర్చలు జరపకుంటే ఆందోళనలు చేపడతాం.. ఉద్యోగ సంఘాల నేతల హెచ్చరిక**

ఈహెచ్ఎస్ పేరుతో ఎటువంటి ముందస్తు విధి విధానాలు ఖరారు చేయకుండానే మే నెల వేతనం నుంచి బేసిక్ పేలో 1.5శాతం అప్రకటిత కోత విధించడంపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎటువంటి చర్చలు, ఉద్యోగుల సమ్మతి లేకుండా, కనీసం జీవో కూడా విడుదల కాకముందే ఆర్థిక శాఖ ఏకపక్షంగా పే స్లిప్ జనరేట్ చేసి వేతన కోతకు పాల్పడటం రాజ్యాంగ విరుద్ధమని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్), తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్(టీఎస్‌సీపీఎస్ఈయూ) విమర్శించాయి. వైద్య చికిత్స అందించే ఆసుపత్రుల జాబితా ప్రకటించకుండా, భార్యాభర్తలు-పెన్షనర్ల మినహాయిపులపై స్పష్టత ఇవ్వకుండా కోత విధించడం వల్ల ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారని డీటీఎఫ్ నేతలు ఎం.సోమయ్య, టి.లింగారెడ్డి విమర్శించారు. కోత పెట్టిన మొత్తాన్ని తిరిగి ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం జీతం, పెన్షన్ అనేవి ఆర్టికల్ 300ఎ కింద ఉద్యోగి ఆస్తి పరిధిలోకి వస్తాయని, ఉద్యోగి సమ్మతి లేకుండా జీతాన్ని కోయడం ఆర్టికల్ 21, 23 ఉల్లంఘన అవుతుందని టీఎస్‌సీపీఎస్ఈయూ నేతలు స్థితప్రజ్ఞ, కల్వల్ శ్రీకాంత్ స్పష్టం చేశారు. ప్రభుత్వం చర్చలు జరపకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# నా పుట్టుక.. ప్రయాణం బీఆర్ఎస్‌తోనే..

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయానికి రేవంత్‌రెడ్డి రైతు డిస్కం ద్వారా ఉరితాడు బిగించడానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. రెండున్నరేళ్లలోనే డిస్కంలకు రూ.25,284 కోట్ల బకాయి పడ్డారని తెలిపారు. సూర్యుడు ఉన్నప్పుడే సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, మిగతా సమయంలో వ్యవసాయాన్ని, సాగునీటి ప్రాజెక్టులను, మిషన్ భగీరథను చీకట్లో ముంచుతారా? అని ప్రశ్నించారు. ఆర్పీడీసీఎల్ ఏర్పాటును విరమించుకోకుంటే రాష్ట్రంలో మరో విద్యుత్ ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

# ఉచిత విద్యుత్ ఎగ్గొట్టేందుకే రైతు డిస్కమ్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సికింద్రాబాద్, (వార్త వేదిక సూర్య)-మే31:

సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే గత ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను అమలు చేస్తేనే వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. రైతులకు 24గంటల ఉచిత విద్యుత్‌ను పూర్తిగా రద్దు చేసేందుకే ప్రత్యేకంగా రైతు డిస్కమ్ తీసుకొస్తున్నారని మండిపడ్డారు. చెప్పింది చేయకపోవడం, చేసింది చెప్పకపోవడం రేవంత్ నైజమని విమర్శించారు. బాలంరాయిలోని క్లాసిక్ గార్డెన్‌లో ఆదివారం జరిగిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ప్రజలు రేవంత్ మోసపూరిత హామీలను నమ్మి, ఇప్పుడు బాధ పడుతున్నారన్నారు. 6లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని పొంగులేటి ప్రకటించారని, 6 మందికి ఇచ్చినట్టు నిరూపించినా రాజీనామా చేస్తానని కేటీఆర్ సవాల్ విసిరారు.

# నేడు కుమరంభీం జిల్లాకు సీఎం

(మొదటి పేజీ తరువాయి)

అదే వేదిక నుంచి రాష్ట్రంలో రెండో విడత కింద 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నారు. చింతలమానేపల్లి మండలంలోని కౌటాలలో రూ.56.55 కోట్లతో ఏర్పాటు చేయనున్న 132/33 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు, గుడ్లబోరి, కాపువాడ, చింతకుంట, అంకుషాపూర్ ప్రాంతాల్లో నిర్మించే 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పనులకూ సీఎం శంకుస్థాపనలు చేయనున్నారు. వీటితో పాటు రెబ్బెన మండలం నాంబాల్‌లో రూ.6 కోట్లతో ఏర్పాటు చేయబోయే సౌర విద్యుత్తు ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో రూ.15 కోట్లతో చేపట్టనున్న తొమ్మిది అభివృద్ధి పనులు, కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో రూ.18.70 కోట్లతో చేపట్టనున్న 8 అభివృద్ధి పనులకు కూడా శంకుస్థాపనలు చేయనున్నారు. సభ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు నివాసానికి చేరుకొని, అక్కడి నుంచి హైదరాబాద్‌కు బయల్దేరతారు. సభకు లక్ష మందిని తరలించేందుకు కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఖర్గేను కలిసిన సీఎం, డిప్యూటీ సీఎం**

కర్ణాటకలోని గుల్బర్గాకు వెళుతూ మధ్యలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోని నోవాటెల్ హోటల్‌లో బస చేసిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు డిప్యూటీ సీఎం భట్టి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, సంపత్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ కూడా ఖర్గేను కలిశారు. రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ చేపట్టనున్న నేపథ్యంలో పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశమై తీసుకున్న నిర్ణయాలను ఖర్గేకు మహేశ్‌గౌడ్ వివరించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని బూత్ స్థాయి ఏజెంట్లకు బుద్ధవనంలో త్వరలో శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరగా ఖర్గే సానుకూలంగా స్పందించారు. ధాన్యం సేకరణలో కేంద్రం సహకరించడం లేదని, దశలవారీగా నిరసన వ్యక్తం చేస్తామని రేవంత్ చెప్పినట్లు తెలిసింది. రేవంత్ సర్కారు పాలనపై ఖర్గే సంతృప్తి వ్యక్తం చేసినట్లు వెల్లడించాయి.

**ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో దేశంలోనే నంబర్1**

రాష్ట్రంలో నిర్మిస్తున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు' భవిష్యత్తులో దేశ విద్యా వ్యవస్థలోనే తెలంగాణను నంబర్ వన్‌గా నిలబెడతాయని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గత పదేళ్లలో జరిగిన విద్యా విధ్వంసాన్ని సరిదిద్ది, విద్యా వికాస పునర్నిర్మాణానికి తమ ప్రభుత్వం నడుం బిగించిందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. పాఠశాల విద్యలో తెలంగాణ పనితీరు గణనీయంగా మెరుగుపడిందని 'పర్‌ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్' (పీజీఐ)లో కేంద్ర విద్యాశాఖ పేర్కొనడంపై రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. "అభివృద్ధికి తొలి కొలబద్ద విద్యే. పేదరికాన్ని నిర్మూలించి, సమాజాన్ని జాగృతం చేయగల శక్తి ఒక్క విద్యకే ఉంది. అందుకే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా విద్యాశాఖ బాధ్యతలను నేనే స్వయంగా తీసుకున్నా" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# 13 నెలల్లో లక్ష ఇళ్లు పూర్తి

- దేశ చరిత్రలోనే అతిపెద్ద గృహ విప్లవం
- 2 నెలల్లో మరో 2 లక్షలు పూర్తి చేస్తాం
- నేడు రెండోవిడత ఇళ్లకు సీఎం శ్రీకారం
- దేవుళ్లు, మతాల పేరిట కొన్ని పార్టీల రాజకీయాలు
- మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్, (వార్త వేదిక సూర్య)-మే31:

ప్రతిష్ఠాత్మక ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన 13 నెలల్లోనే దాదాపు లక్ష ఇళ్లు పూర్తి చేశామని.. దేశ చరిత్రలోనే ఇది అతిపెద్ద గృహ విప్లవమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థికసాయంతో భారీ ఎత్తున చేపట్టిన ఈ పథకంతో తెలంగాణ దేశానికే మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. ఇది గృహ నిర్మాణ కార్యక్రమమే కాకుండా.. సీఎం రేవంత్ నాయకత్వంలో మార్చేస్తున్న సామాజిక ఉద్యమంగా మారిందని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని, వీటిలో ఇప్పటివరకు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, ఒకటి రెండు నెలల్లో మరో రెండు లక్షల ఇళ్లు పూర్తికాబోతున్నాయని తెలిపారు. సోమవారం ఆసిఫాబాద్ జిల్లా కెరిమెర మండలంలోని కొఠారి గ్రామంలో రెండో విడత కింద 2.50 లక్షల ఇళ్లను సీఎం రేవంత్ ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం కొత్తగూడలో సామూహిక గృహప్రవేశంలో సీఎం పాల్గొంటారని తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల మంజూరుకు పరిపాలనా అనుమతులు ఇచ్చామన్నారు. కాగా, వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి 2013 వరకు అమలు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇళ్లు మంజూరై ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్న వాటిని పూర్తి చేయడానికి... 2023లో గృహలక్ష్మి పథకంలో ఇళ్లు మంజూరై పూర్తి చేసుకోలేకపోయిన వారికి...రెండో విడతలో ఆర్థికసాయాన్ని అందిస్తామన్నారు.

దేశంలోని చాలా రాష్ట్రాలు కేంద్రం ఇచ్చే పరిమిత నిధులతోనే గృహ నిర్మాణాలను కొనసాగిస్తున్నాయన్నారు. తెలంగాణ మాత్రం పేదవాడి ఇల్లు - ప్రభుత్వ బాధ్యత అనే లక్ష్యంతో సొంత నిధులనే ఖర్చు చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కేంద్రం రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు మాత్రమే ఇస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారుడికి రూ.5 లక్షల సాయం అందిస్తోందన్నారు. అంతకుముందు మంత్రి పొంగులేటి ఖమ్మం రూరల్ మండలంలోని కొండాపురంలో రూ.5.20 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతును రాజును చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే.. రూ.25 లక్షల మందికి రూ.21 వేల కోట్ల మేర రుణమాఫీ చేశామని తెలిపారు.అన్ని రకాల పంటలను రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తోందన్నారు. సన్న వడ్లకు మద్దతు ధరతోపాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందజేస్తున్నామన్నారు. దేవుళ్లు, మతాల పేరిట కొన్ని పార్టీలు రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి రెండేళ్లలోనే 72వేల మంది నిరుద్యోగులకు నియామక పత్రాలు అందించామని మంత్రి పొంగులేటి తెలిపారు

# బెంగళూరుదే ఐపీఎల్ ట్రోఫీ

(మొదటి పేజీ తరువాయి)





నిలిచారు.

**విరాట్ అజేయంగా..**

స్వల్ప ఛేదనను ఆర్‌సీబీ మెరుపు వేగంతో ఆరంభించింది. ఓపెనర్ విరాట్ కోహ్లీ కీలక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. మధ్య ఓవర్లలో వేగంగా వికెట్లు కోల్పోయినా తను మాత్రం చివరి వరకు ఓపిగ్గా క్రీజులో నిలిచాడు. అలాగే లక్ష్యం తక్కువే కావడంతో ఆర్‌సీబీకి కూడా ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదు. తొలి ఓవర్‌లో సిరాజ్ ఐదు పరుగులే ఇచ్చినా ఆ తర్వాత ఆర్‌సీబీ దూసుకెళ్లింది. రెండో ఓవర్‌లో మరో ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్ 4,6,4,4తో 18 రన్స్.. నాలుగో ఓవర్‌లో విరాట్ 4,4,6,4తో 19 రన్స్ రాబట్టడంతో జట్టు స్కోరు 4 ఓవర్లలోనే 55 పరుగులకు చేరింది. అయితే జోరు మీదున్న అయ్యర్‌ను సిరాజ్ అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 27 బంతుల్లో 62 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు దేవ్‌దత్ (1)ను రబాడ పెవిలియన్‌కు చేర్చడంతో పవర్‌ప్లేలో జట్టు 70/2తో పటిష్ట స్థితిలో నిలిచింది. ఆ తర్వాత పరుగుల జోరు నెమ్మదించింది. దీనికి తోడు స్పిన్నర్ రషీద్ 9వ ఓవర్‌లో రజత్ (15), క్రునాల్ (1) వికెట్లు తీయడంతో గుజరాత్‌లో జోష్ కనిపించింది. కానీ విరాట్ నిలకడగా క్రీజులో నిలిచాడు. అడపాదడపా బౌండరీలతో జట్టును విజయం దిశగా నడిపించాడు. అలాగే ఓ ఫోర్‌తో 25 బంతుల్లోనే తన ఐపీఎల్ కెరీర్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీని పూర్తి చేశాడు. టిమ్ డేవిడ్ ఉన్న కాసేపు వేగంగా ఆడి 14వ ఓవర్‌లో వెనుదిరిగాడు. అప్పటికి ఆరు ఓవర్లలో 24 పరుగులే అవసరం కావడంతో మ్యాచ్ ఫలితమేమిటో తెలిసిపోయింది. 16వ ఓవర్‌లో విరాట్ క్యాచ్‌ను గిల్ అందుకున్నా.. డైవింగ్ సమయంలో బంతి నేలకు తాకడంతో నాటౌట్‌గా ప్రకటించారు. ఆ తర్వాత జితేశ్ (11 నాటౌట్) సహాయంతో విరాట్ 4,6తో మరో 12 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

**బౌలర్లదే పైచేయి**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ పరుగుల కోసం అల్లాడింది. అటు ఆర్‌సీబీ బౌలర్లు బౌన్స్‌ను సద్వినియోగం చేసుకుంటూ వికెట్ల వేట సాగించగా.. టైటాన్స్ పూర్తి ఒత్తిడిలో పడింది. ఏ ఒక్క బ్యాటరూ క్రీజులో నిలిచే ప్రయత్నం చేయలేదు. ఈ కీలక మ్యాచ్‌లోనూ మిడిలార్డర్ ఆకట్టుకోలేకపోయింది. వాషింగ్టన్ సుందర్ మాత్రమే ఆఖరి వరకు పోరాడి గౌరవప్రదమైన స్కోరందించాడు. ఇక సక్సెస్‌ఫుల్ ఓపెనర్లుగా పేరు తెచ్చుకున్న గిల్ (10), సుదర్శన్ (12) తొలి నాలుగు ఓవర్లలోనే పెవిలియన్‌కు చేరడంతో టైటాన్స్ ఆట ఒక్కసారిగా గతి తప్పింది. బౌలర్లు కట్టడి చేయడంతో జట్టు పవర్‌ప్లేలో 45/2 స్కోరు మాత్రమే చేయగలిగింది. యువ బ్యాటర్ నిశాంత్ మూడు ఫోర్లతో ఆకట్టుకున్నా ఎనిమిదో ఓవర్‌లో రసిఖ్ అతడిని అవుట్ చేశాడు. అయితే క్రీజులో వెటరన్ బట్లర్-సుందర్ ఉండడంతో టైటాన్స్ ఆశలు వదులుకోలేదు.

పదో ఓవర్‌లో సుందర్ క్యాచ్‌ను కాక్స్ పట్టినా అతడి చేతి వేళ్లు నేలను తాకడంతో నాటౌట్‌గా ప్రకటించారు. మరోవైపు మధ్య ఓవర్లలో స్పిన్నర్ క్రునాల్, రసిఖ్ మరింత పట్టు బిగించగా 7-12 ఓవర్ల మధ్య ఒక్క బౌండరీ కూడా నమోదు కాలేదు. ఒత్తిడికి లోనైన బట్లర్.. క్రునాల్ ఓవర్‌లో ముందుకు వచ్చి షాట్ ఆడి స్టంపౌట్ అయ్యాడు. 13వ ఓవర్‌లో అర్షద్ (15) వచ్చి రాగానే వీరి ఇన్నింగ్స్‌లో తొలి సిక్సర్ బాదాడు. తర్వాతి ఓవర్‌లో సుందర్ రెండు ఫోర్లు, అర్షద్ మరో సిక్సర్‌తో 16 పరుగులు సమకూరడంతో జట్టు గాడిలో పడినట్టనిపించింది. కానీ ఓవర్ వ్యవధిలోనే అర్షద్‌తో పాటు తెవాటియా (7) కూడా వెనుదిరగడం దెబ్బతీసింది. 18వ ఓవర్‌లో సుందర్ 4,4, హోల్డర్ (7) 4తో 16 రన్స్ రావడం కాస్త ఊరటనిచ్చింది. చివరి ఓవర్‌లో రషీద్ (7) వికెట్ కోల్పోగా.. సుందర్ 37 బంతుల్లో అజేయ హాఫ్ సెంచరీ పూర్తి చేసి స్కోరును 150 దాటించగలిగాడు.

**స్కోరుబోర్డు**

**గుజరాత్:** సాయి సుదర్శన్ (సి) జితేశ్ (బి) భువనేశ్వర్ 12, గిల్ (సి) రజత్ (బి) హాజెల్‌వుడ్ 10, నిశాంత్ (సి) పడిక్కళ్ (బి) రసిఖ్ 20, బట్లర్ (స్టంప్డ్) జితేశ్ (బి) క్రునాల్ 19, వాషింగ్టన్ (నాటౌట్) 50, అర్షద్ (సి) రసిఖ్ (బి) హాజెల్‌వుడ్ 15, తెవాటియా (సి) రజత్ (బి) రసిఖ్ 7, హోల్డర్ (సి) హాజెల్‌వుడ్ (బి) భువనేశ్వర్ 7, రషీద్ (సి) షెఫర్డ్ (బి) రసిఖ్ 7, రబాడ (నాటౌట్) 3, ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 155/8; వికెట్ల పతనం: 1-22, 2-26, 3-55, 4-73, 5-99, 6-115, 7-142, 8-151; బౌలింగ్: డఫీ 4-0-38-0, భువనేశ్వర్ 4-0-29-2, హాజెల్‌వుడ్ 4-0-37-2, రసిఖ్ 4-0-27-3, క్రునాల్ 4-0-23-1.

**బెంగళూరు:** వెంకటేశ్ (సి) రబాడ (బి) సిరాజ్ 32, కోహ్లీ (నాటౌట్) 75, పడిక్కళ్ (సి) అర్షద్ (బి) రబాడ 1, రజత్ పటీదార్ (సి) రబాడ (బి) రషీద్ 15, క్రునాల్ (ఎల్బీ) రషీద్ 1, టిమ్ డేవిడ్ (సి) బట్లర్ (బి) అర్షద్ 24, జితేశ్ (నాటౌట్) 11, ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 18 ఓవర్లలో 161/5; వికెట్ల పతనం: 1-62, 2-63, 3-89, 4-91, 5-132; బౌలింగ్: సిరాజ్ 4-0-36-1, రబాడ 3-0-44-1, హోల్డర్ 2-0-16-0, రషీద్ 4-0-25-2, అర్షద్ 4-0-32-1, ప్రసిద్ధ్ 1-0-7-0.

ఒకే ఐపీఎల్ సీజన్‌లో ఎక్కువ వికెట్లు (28) తీసిన రెండో భారత బౌలర్‌గా షమి (2023లో)తో సంయుక్తంగా నిలిచిన భువనేశ్వర్. హర్షల్ పటేల్ (2021లో 32) ముందున్నాడు.

ఐపీఎల్ ఫైనల్స్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ (3.3 ఓవర్లలో) నమోదు చేసిన జట్టుగా బెంగళూరు రాయల్ చాలెంజర్స్.

కెప్టెన్సీ చేపట్టిన తొలి రెండు సీజన్లలోనూ జట్టును విజేతగా నిలిపిన సారథిగా రజత్ పటీదార్.

**ప్రైజ్‌మనీ విజేతకు:** రూ. 20 కోట్లు
**రన్నరప్‌కు:** రూ.12.50 కోట్లు

**అత్యధిక పరుగులు**

వైభవ్ సూర్యవంశీ (రాజస్థాన్) 776
శుభ్‌మన్ గిల్ (గుజరాత్) 732
సాయి సుదర్శన్ (గుజరాత్) 722
విరాట్ కోహ్లీ (బెంగళూరు) 675
హెన్రిచ్ క్లాసెన్ (హైదరాబాద్) 624

ఎక్కువ సిక్సలు: వైభవ్ సూర్యవంశీ (72, రాజస్థాన్)

ఓ జట్టు అత్యధిక స్కోరు : పంజాబ్ (265/4)

ఆటగాడి అత్యధిక స్కోరు : రాహుల్ (152 నాటౌట్, ఢిల్లీ)

ఈ సీజన్‌లో అత్యధిక శతకాలు : సంజూ శాంసన్ (2, చెన్నై)

బెస్ట్ బౌలింగ్: మొహిసిన్ ఖాన్ (5/23, లఖ్‌నవూ)

**అత్యధిక వికెట్లు**

కగిసో రబాడ (గుజరాత్) 29
భువనేశ్వర్ (బెంగళూరు) 28
జోఫ్రా ఆర్చర్ (రాజస్థాన్) 25
రషీద్ ఖాన్ (గుజరాత్) 21
అన్షుల్ కాంబోజ్ (చెన్నై) 21

# ఫెర్టిలైజర్ యాప్‌తో విప్లవాత్మక మార్పు

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మే 31:

రాష్ట్ర వ్యవసాయశాఖ అమల్లోకి తెచ్చిన 'ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్' దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. ఎరువుల సరఫరాలో రైతాంగానికి ఇది ఉపయుక్తంగా ఉందని యూరియా కోసం క్యూలైన్లలో నిలబడాల్సిన పనిలేకుండా చేసిందన్నారు. వ్యవసాయ రంగంలో ఇదొక విప్లవాత్మక మార్పు అని.. కేంద్ర ప్రభుత్వానికి మార్గదర్శిగా మారిందని పేర్కొంటూ ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ యాప్‌లోని రియల్ టైమ్ స్టాక్ విజిబిలిటీ, రైతు వారీ డిజిటల్ బుకింగ్, పంటల ఆధారిత ఎరువుల సరఫరా వ్యవస్థ లాంటి అంశాలను.. కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేసి డిజిటల్ వ్యవసాయ పరిపాలనకు శ్రీకారం చుట్టిందని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రైతుల ముసుగులో రాజకీయ ప్రేరేపిత ఆందోళనలకు ఈ యూరియా యాప్ చెక్ పెట్టిందని తెలిపారు.

# నువ్వు మేనేజ్‌మెంట్ కోటా.. రేవంత్ మెరిట్ కోటా

- మీ హయాంలో ఒక్క గురుకుల భవనమైనా నిర్మించారా!
- కేటీఆర్‌పై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విమర్శలు

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మే 31:

పదేళ్ల పాటు కేటీఆర్ రాజులా విర్రవీగారని.. అమెరికా నుంచి నేరుగా వచ్చి స్థానిక నేత మహేందర్‌రెడ్డి టికెట్ లాక్కుని ఎన్ఆర్ఐ కోటాలో తెలంగాణలో పోటీ చేశారే తప్ప ఆయనకు ప్రజాస్వామ్యంపై అవగాహన లేదన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల నుంచి సీఎం స్థాయి వరకు ఒక్కోమెట్టు ఎక్కుతూ మెరిట్ కోటాలో ప్రజాదరణతో ఈ స్థాయికి వచ్చారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు. సీఎల్పీ కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఒక్క గురుకుల పాఠశాలకైనా సొంత భవనాన్ని నిర్మించినట్లు నిరూపిస్తే తాను దేనికైనా సిద్ధమన్నారు. వారి హయాంలో గురుకులాల సంఖ్యను పెంచి, మౌలిక వసతులను గాలికొదిలేశారని విమర్శించారు. గత ప్రభుత్వంలో ఏర్పాటైన గురుకులాలన్నీ నేటికీ అద్దె భవనాల్లో మగ్గుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాతే గురుకులాల్లో డైట్ ఛార్జీలు పెంచామని, సరైన వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. దళితులపై ఉన్న ప్రేమ ఎలాంటిదో గతంలోనే రుజువైందని, కొప్పుల ఈశ్వర్‌ను అప్పట్లో కేసీఆర్ మీడియా ముందే అవమానించిన ఉదంతాన్ని ఆయన ప్రస్తావించారు. కేవలం 38వేలమందికే దళితబంధు ఇచ్చి అందరికీ ఇచ్చేశామంటూ కేటీఆర్ ప్రగల్భాలు పలుకుతున్నారని దుయ్యబట్టారు.

# ఈటలకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు

హైదరాబాద్/మేడ్చల్, (వార్త వేదిక సూర్య)-మే 31:

బీజేపీ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వ్యతిరేకంగా కేపీహెచ్‌బీ, మల్కాజిగిరి, సికింద్రాబాద్ ప్రాంతాలతో పాటు గుండ్లపోచంపల్లి డివిజన్ మునీరాబాద్ సమీపంలోని ఆయన ఇంటి ముందు కూడా ఫ్లెక్సీలు వెలిశాయి. 'బీజేపీ నీ కోసం నిలబడితే నువ్వు బీజేపీకి చేసింది ఏంటి? అసలు నీ వల్ల బీజేపీకి జరిగిన మేలేంటి?' అనే ప్రశ్నలతో కూడిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు మెట్రో ఫుట్‌పాత్ రెయిలింగ్‌లు, విద్యుత్ స్తంభాలకు కట్టారు. ఈ వ్యవహారం స్థానికంగానే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. ఈ చర్యను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఖండిస్తూ పార్టీని బలహీనపరిచేందుకు కుట్రలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. శనివారం అర్ధరాత్రి తర్వాత ఏర్పాటు చేసినట్టు భావిస్తున్న ఫ్లెక్సీలు మరుసటి రోజు ఆదివారం కన్పించలేదు. అయితే అప్పటికే అవి సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. 'బీజేపీ ఎన్నో అవకాశాలు కల్పించి పెద్ద నాయకుడిని చేసింది. నీకింకా అసంతృప్తి దేనికి ఈటల' అని ఒక ఫ్లెక్సీలో రాసుకొచ్చారు. 'టీఆర్ఎస్‌కు ఓనర్‌ను నేనే అంటేనే కదా కేసీఆర్ మెడపట్టి నిన్ను బయటకు నెట్టింది. ఇప్పుడే అదే పరిస్థితి బీజేపీలో తెచ్చుకోకు' అని మరో ఫ్లెక్సీలో పేర్కొన్నారు. 'పార్టీ నా చుట్టూ తిరగాలి. నేను చెప్పిందే అందరూ వినాలి' అన్న ఈటల అహంకారంతో బీజేపీ పట్టు కోల్పోతోందని రాశారు. పార్టీ కంటే వ్యక్తిగత ఇమేజ్ పెంచుకునే ప్రయత్నం చేయడం వల్లే పార్టీ నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. గ్రూపు రాజకీయాలు, డబ్బున్న వారిని అందలం ఎక్కించే ప్రయత్నం మంచిది కాదని రాసుకొచ్చారు. పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి రాలేదని, సీఎం అభ్యర్థిగా ప్రకటించలేదని, కేంద్ర మంత్రి పదవి ఇవ్వలేదని ఈటల ఏడుపని, అదే బీజేపీకి శాపమని విమర్శించారు. పార్టీ కోసం పనిచేసే వారిని పక్కన పెట్టడం, తనకు జోకే వారినే ప్రోత్సహించడం వల్ల పార్టీకి తీవ్ర నష్టమని పేర్కొన్నారు. కాగా, తమ పార్టీ నేతల మధ్య విభేదాలు సృష్టించేందుకు కొన్ని పార్టీలు, శక్తులు చిల్లర రాజకీయాలు చేస్తున్నాయని రాంచందర్‌రావు ఒక ప్రకటనలో ఆరోపించారు.

సంపుటి: 2 సంచిక: 12 వార్త వేదిక సూర్య
హైదరాబాద్
సోమవారం, జూన్ 01, 2026




## విశ్వబ్రాహ్మణ/ విశ్వకర్మ ఒకే కుల జనాభాగా ప్రభుత్వం ప్రకటించాలి

**విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ కార్పొరేషన్కు పాలకమండలి వెంటనే ఏర్పాటు చేయాలి**

**తెలంగాణ జాతిపిత సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్, తెలంగాణ తొలి అమరుడు శ్రీకాంత్ చారి విగ్రహాలను అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలి**

**50 సంవత్సరాలు నిండిన ప్రతి విశ్వకర్మ బిడ్డకు సామాజిక పెన్షన్ కింద నెలకు 5 వేలు ఇవ్వాలి**

**విశ్వకర్మ జేఏసీ చైర్మన్ రాయబండి పాండురంగాచారి**

చౌటుప్పల్ మే 31 వార్తా వేదిక సూర్య



హైదరాబాద్ అమరవీరుల స్థూపం వద్ద విశ్వకర్మ జేఏసీ వైస్ చైర్మన్ నందిపేట రవీంద్ర చారి అధ్యక్షతన పెద్ద ఎత్తున హైదరాబాద్ అమరవీరుల స్థూపం వద్ద విశ్వకర్మ జేఏసీ ఆదివారం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి విశ్వకర్మ జేఏసీ చైర్మన్ పాండురంగచారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కులాల వారిగా జనాభా ప్రకటించిన నేపథ్యంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ కులానికి వృత్తుల వారిగా జనాభా కాకుండా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఒకే కులం గా గుర్తించి కుల జనాభా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి, పాలకమండలి వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులగణన జరిపిన తరువాత తేది ఏప్రిల్ 16న రాష్ట్రంలోని అన్ని కులాల జనాభా ప్రకటించింది. రాష్ట్రంలో అన్ని కులాలు ఏ విధంగా ప్రకటించారో అదేవిధంగా మా విశ్వబ్రాహ్మణ/ విశ్వకర్మ కులం ఒకే కులం గా ప్రకటించాలి. విశ్వబ్రాహ్మణ /విశ్వకర్మ ఒ కే కులంగా కాకుండా, విడగొట్టి విడివిడిగా కమ్మరం, వడ్రంగం, కంచరం, శిల్పి,స్వర్ణకార వృత్తులను కులాలుగా ప్రకటించింది. అంటే మా కుల జనాభా రాష్ట్రంలో ఎంత ఉన్నది అనేది స్పష్టత లేకుండా పోయింది.రాష్ట్రంలో అన్ని కులాల జనాభా ప్రకటిస్తే మా కులం మాత్రం విడగొట్టి వృత్తులను కులాలుగా ప్రకటించడం ఎంతవరకు న్యాయం? ఒకే కులంగా ప్రకటించాలని సంబంధిత బీసీ కమిషన్ చైర్మన్ కు,మంత్రులకు, సలహాదారులకు విశ్వకర్మ జేఏసీ ఆధ్వర్యంలో వారి దృష్టికి తీసుకపోయినా ఫలితం దక్కలేదు. ఒకే కుల జనాభా ప్రకటించమని హైకోర్టు తీర్పు ఇచ్చిన కూడా రాష్ట్ర ప్రభుత్వం పెడచెవినిపెట్టడం ఎంతవరకు సమంజసం . ప్రభుత్వానికి ప్రజలనుండి,ప్రజాసంఘాల నుండి ఎన్ని వినతులు చేసినప్రభుత్వం స్పందించిడం లేదు, .అన్ని కులాలకు పాలకమండలి కార్పొరేషన్ లు చైర్మన్,వైస్ చైర్మన్ గా ప్రకటించారు, కానీ విశ్వబ్రాహ్మణ /విశ్వకర్మకులానికిమాత్రం ప్రకటించకపోవడం ఇంతకన్నా అవమానం మరొకటి లేదని . అందుకు మన పంచదాయాలుగా ఉన్న మనం విశ్వబ్రాహ్మణుల/విశ్వకర్మల ఆత్మగౌరవం కోసం ఏకం కావాల్సిందేనని , లేని పక్షంలో మన ఆత్మాభిమానానికి అవమానం జరిగినట్లే

పీడిత జన సామాజిక విప్లవకారుడు, మలిదశ తెలంగాణ పోరాట ఆద్యుడు, బహుజన వీరుడు, విశ్వకర్మ ముద్దుబిడ్డ మారోజు వీరన్న, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధనలో తొలి మలి దశ ఉద్యమానికి ఊపిరి పోసిన తెలంగాణ జాతిపిత సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్, నూనుగు మీసాల నూతన యవ్వనంలో రాష్ట్ర సాధనలో తన ప్రాణాలను తృణప్రాయంగా ఊపిరి వదిలిన అమరుడు శ్రీకాంతాచారి లాంటి విశ్వకర్మ వీరుల బలిదానం తో పాటు రాష్ట్రవ్యాప్తంగా మరొక 39మంది విశ్వకర్మలు ఆత్మ త్యాగాలు చేసిన జాతివల్ల తెలంగాణ వచ్చింది అనేది తెలంగాణ సాక్షిగా నిజం కాదా?..

మా బలిదానాలతో ముఖ్యమంత్రులు, మంత్రులు అవుతారు కానీ, త్యాగాలు చేసిన మాకు బలిదానాలు,-ఏ త్యాగం చేయని మీకు రాజ్యం...ఇది చెల్లదు గాకా చెల్లదు.ఇక ఊరుకునే ప్రసక్తే లేదు. తెలంగాణ అమరుల సాక్షిగా అన్ని రంగాల్లో మేమెంతో మాకంతా వాటా కోసం విశ్వకర్మలంతా ఏకం కావాల్సిందేలి నని అదేవిధంగా తెలంగాణ సిద్ధాంతకర్త జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ సార్ ను తెలంగాణ రాష్ట్ర సాధనలో మలిదశ అమరుడు శ్రీకాంత్ చారి విగ్రహాలను అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ప్రపంచీకరణ విధానాల వలన పంచ వృత్తులు దెబ్బతిని ఆర్థికంగా వెనుకబడి బతుకుబారం మైందన్నారుఅన్నారు అందుకు ప్రతి విశ్వకర్మ ముద్దుబిడ్డ కు 50 సంవత్సరాల నిండిన సామాజిక పెన్సిల్ కింద నెలకు 5 వేల రూపాయలు ఇవ్వాలని మా సమస్యలు పరిష్కరించని ఎడల త్వరలోవేలాది మంది విశ్వకర్మలతో గాంధీభవన్ ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ పాండురంగ చారి డిమాండ్ చేశారు .

విశ్వకర్మజేఏసీ వైస్ చైర్మన్స్ పూసల శ్రీకాంతచారి బెజ్జంకి ప్రభాకర చారి, మోత్కూరి మల్లా చారి ఓదెల హైమావతి నాగార్జున రాజ్యలక్ష్మి , ఫిరంగి భాస్కరాచారి పర్వతం సైదాచారి, మెగా శ్యామ్ ఒంగోజు వేనాచారి పూసల ప్రవీణ్ చారి మారోజు సునీల్ కుమార్ చీరాల జలంధర్ చారి సదానంద చారి అద్దంకి కృష్ణమాచారి ఎస్ వెంకటేశ్వర్లు రవి శంకర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



## సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నాంపల్లి చంద్రమౌళి

గట్టుపల్ మే 31 వార్తా వేదిక సూర్య

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నాంపల్లి చంద్రమౌళి అన్నారు. చండూరు మండల కేంద్రంలో ఎస్కేయం జాతీయ కమిటీ పిలుపులో భాగంగా రైతు పండించిన పంటకు మద్దతు ధర చట్టాన్ని పార్లమెంట్లో చేయాలని, జస్టిస్ జేపీ గోష్, స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని సిపిఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలియజేసి రైతు వ్యతిరేక జీవో కాపీలను ద్వసం చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు రైతుల ఇచ్చిన వాగ్దానాలను మరిచిపోయి మూడోసారి గద్దనెక్కిన బిజెపి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని మండిపడ్డారు.

ఎస్కేమ్ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో 13 నెలలు రైతులు తమ హక్కుల కోసం, పండించిన పంటకు మద్దతు ధరను చెల్లించాలని పార్లమెంటులో చట్టం చేయాలని ధర్నాలు నిర్వహించినా విషయాలను గుర్తు చేశారు.

ఆరోజున బిజెపి ప్రభుత్వం రైతు ధర్నాకు భయపడి రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకుంటున్నామని చెప్పి మళ్ళీ మూడోసారి గద్దెనెక్కి ఆ చట్టాలను అమలు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం వైఖరి స్పష్టం అవుతుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ, సిపిఎం సీనియర్ నాయకులు చిట్టి మల్ల లింగయ్య, రైతు సంఘం మండల కార్యదర్శిఈరటి వెంకటయ్య, సాయం కృష్ణయ్య, నరేష్, నగేష్, రమేష్, వెంకన్న, అంజి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



## నూతన పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారీని ఆశీర్వదించిన బీ ఆర్ యస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వద్య రమేష్

దేవరకొండ మే 31 (వార్త వార్తా వేదిక ):-

ఆదివారం రోజున చింతపల్లి మండలం ఉమ్మెతల పల్లికి చెందిన బీ ఆర్ యస్ ఉప సర్పంచ్ అల్వాల్ - మంజుల గార్ల కుమార్త్ కుమారుల నూతన పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమంలో చింతపల్లి లోని సాయి రామవేంద్ర ఫంక్షన్ హాల్ పాల్గొని చిన్నారీని ఆశీర్వదించిన బీ ఆర్ యస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వద్య రమేష్

బీ ఆర్ యస్ గ్రామ సర్పంచ్ వంగాల స్రవంతి - రమేష్ ,రాములు,రవి,బత్తిని ఇంద్రారెడ్డి,మాజీ సర్పంచ్ భాస్కర్ కాటేపాక వెంకటయ్య మేఘముని వెంకట్. తిరుపతయ్య. రవి,జక్కుల విజయ్ కుమార్, కె కొండల్. కొట్టం శివ,రాఘవేందర్, మంద సైదుల్, శివ కృష్ణయ్య.కోటేష్ , రమేష్, మహేందర్, శివ, తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సమస్యలు తీర్చడమే తన లక్ష్యం

**చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్,**

చౌటుప్పల్ మే 31 వార్తా వేదిక సూర్య

చౌటుప్పల్ మున్సిపాలిటీలోని ప్రజా సమస్యలు తీర్చడమే తమ వేయమని మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే మునుగోడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చౌటుప్పల్ మున్సిపాలిటీలోని వలిగొండ రోడ్ల గల బీటీ రోడ్డు గతంలో రెండుసార్లు మరమత్తులు చేయగా, మళ్లీ భారీ వాహనాలు రాకపోకలు సాగించడం వల్ల రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారింది, ఆదివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ చైర్పర్సన్ మొగుదల పావని రమేష్ గౌడ్ వలిగొండ రోడ్ లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి కోర్టుకు వెళ్లే దారి వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15 రోజులు రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్ తో మాట్లాడి ఎమ్మెల్యే మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో బిటి రోడ్డు శాశ్వత పరిష్కారం చేస్తామని అన్నారు. పనులు



ప్రారంభం కావడంతో వాహనదారులు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## నిరుపేద యువకునికి ఆర్థిక సహాయం అందించిన జాలే నరసింహారెడ్డి

దేవరకొండ మే 31 (వార్త వేదిక సూర్య):-



ఆదివారం రోజున నేరేడుగొమ్ము మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన పులికంటి అనిల్ . సార్ నాకు ఏం ఉపాధి లేదు ఏమైనా ఉపాధి చూపించండి సార్ అని అడగగా వెంటనే మంచి మనసుతో స్పందించిన నాయకులు పీసీసీ సభ్యులు పిఎసిఎస్ చైర్మన్ జాలే నరసింహారెడ్డి ఆటో కొనుక్కోమని 50,000రూ,, అక్షరాల యాభై వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది

## ఎల్లంబావి ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

**ఐదు రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి..**

**లేకపోతే జాతీయ రహదారిపై రైతులతో కలిసి ఆందోళన చేస్తాం అధికారులకు కూసుకుంట్ల హెచ్చరిక**

చౌటుప్పల్ మే 31 వార్తా వేదిక సూర్య

చౌటుప్పల్ మండలంలోని ఎల్లంబావి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం మునుగోడు మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పరిశీలించారు. కేంద్రంలో ధాన్యం అమ్మేందుకు వచ్చిన రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా తెలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి రోజుల తరబడి వేచి చూస్తున్నప్పటికీ కొనుగోలు ప్రక్రియ నెమ్మదిగా సాగుతుండటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో ఉన్న ధాన్యం నిల్వలు, తూకం ప్రక్రియ, రవాణా ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు.



ఈ సందర్భంగా కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు పండించిన పంటకు సరైన సమయంలో గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ఏర్పడిన సమస్యలను వెంటనే పరిష్కరించి ఐదు రోజులలోపు ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను కోరారు.

అలా చేయకపోతే రైతులతో కలిసి జాతీయ రహదారిపై భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. రైతుల కష్టాలను ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదని, రైతుల పక్షాన తాము ఎప్పుడూ అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రైతులు కార్యకర్తలు పాల్గొన్నారు.




## చిన్నారులను ఆశీర్వదించిన బీఆర్యస్ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్



దేవరకొండ మే 31 (వార్త వేదిక సూర్య):-

నెరడుగొమ్ము మండలం లోని కాచురాజుపల్లి గ్రామానికి చెందిన గన్నెబోయిన రామాంజనేయులు - అలివేలు ల కుమార్తె మోక్ష శ్రీ నూతన పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారి ని ఆశీర్వదించిన బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్ ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు వద్య రమేష్ నాయక్, బొమ్మ గోవిందు, రాజు , శ్రీనయ్య, పెద్ద అంజయ్య, శంకర్ , తదితరులు పాల్గొన్నారు



సంపుటి : 2 సంచిక: 12 వార్త వేదిక సూర్య హైదరాబాద్ సోమవారం, జూన్ 01, 2026



# వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు సేవ చేసే భాగ్యం దొరకడం అదృష్టం

### సత్య సాయి సేవ సమితి నల్గొండ కన్వీనర్ పున్న విశ్వేశ్వర్

నల్లగొండ బ్యూరో, మే 31 (వార్తా వేదిక సూర్య )

వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు సేవ చేసే భాగ్యం దొరకడం అదృష్టమని శ్రీ సత్య సాయి సేవ సమితి నల్గొండ కన్వీనర్ పున్న విశ్వేశ్వర్ అన్నారు. గత 28 సంవత్సరాలుగా హైదరాబాదు రోడ్ లోని తిరుమల థియేటర్ ఎదురుగా సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో బాటసారుల, కార్మికుల ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం నిర్వహిస్తున్నామని, చలివేంద్రంలో మంచినీరే కాక మజ్జిగ నిమ్మరసం పంపిణీ చేశామని అన్నారు. ఈ సంవత్సరం 53 రోజులుగా నిరాటంకంగా సత్య సాయి సేవ సమితి స్త్రీ పురుష సేవాదళ్ సభ్యులు సేవలు అందించడం జరిగిందని, తమ సంస్థకు ప్రతి సంవత్సరం సహకరిస్తున్న పల్లెర్ల యాదగిరి కుటుంబ సభ్యులను సేవా సమితి ఆధ్వర్యంలో సన్మానించారు.

# జీవో నెంబర్ 7ను బేషరతుగా రద్దు చేయాలి..

### బీసీ విద్యార్థులకు అన్యాయం జరిగితే సహించం మేకపోతుల నరేందర్ గౌడ్





నల్లగొండ బ్యూరో, మే 31 (వార్తా వేదిక సూర్య )

నల్గొండ జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షులు చిలకరాజు సతీష్ కుమార్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేంద్ర గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల సంక్షేమం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నాయని ఆయన విమర్శించారు. రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు రాజకీయ, విద్యా, ఆర్థిక రంగాల్లో తగిన ప్రాధాన్యత కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. బీసీల అభ్యున్నతికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టి, వారి హక్కులను పరిరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బకాయిలను సకాలంలో విడుదల చేయకపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించలేక అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్న పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.

అర్హులైన ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పూర్తిస్థాయిలో అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బీసీల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు బీసీల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్య వైఖరి మరియు జీవో నెంబర్ 7 ను రద్దు చేసే అంతవరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని మేకపోతుల నరేందర్ గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొండ రామకృష్ణంరాజు, రాష్ట్ర అధికార ప్రతినిది నీలం వెంకట మధు, రాష్ట్ర లీగల్ అడ్వైజర్ చొల్లేటి రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్త లింగస్వామి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు సత్యనారాయణ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు వెంపటి నరసింహ జిల్లా నాయకులు దొండ సాంబయ్య, ఊళ్లేశీదుల అంజయ్య, డబ్బికార్ రాజా, కృష్ణ యాదవ్, కాస్పరాజ్ జానీ, మధు, గద్దం మారయ్య, రేక్య నాయక్, కొత్తకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### నల్లగొండ జిల్లా వ్యాప్తంగా విస్తృత నాఖా బందీ..

# ఆకస్మిక వాహన తనిఖీలు



**దాదాపు 1500 మంది పోలీసు సిబ్బంది తో ప్రత్యేక తనిఖీలు..**

**అనుమానస్పద వాహానాలు, వ్యక్తుల పై ప్రత్యేక నిఘా**

**ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం**

**నేర నియంత్రణకు నిరంతర తనిఖీలు**

**జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**



నల్లగొండ బ్యూరో, మే 31 (వార్తా వేదిక సూర్య )

నల్లగొండ జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించే లక్ష్యంతో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు శనివారం రాత్రి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిల్లో నాఖా బందీ నిర్వహించి ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో జిల్లా ఎస్పీ స్వయంగా పాల్గొని వివిధ ప్రాంతాల్లో తనిఖీలను పరిశీలిస్తూ పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో దాదాపు 1500 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో ప్రత్యేకంగా 47 చెక్ పాయింట్లు ఏర్పాటు చేసి విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండతో పాటు ప్రధాన పట్టణాలు, జాతీయ రహదారులు, రద్దీ కూడళ్లు, అనుమానాస్పద ప్రాంతాలు మరియు రాత్రి వేళల్లో యువకుల గుంపులు ఎక్కువగా తిరిగే ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు మరియు ఇతర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, నంబర్ ప్లేట్లు పరిశీలించడంతో పాటు మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, సైలెన్సర్ల మార్పులు చేసిన వాహనాలు, నంబర్ ప్లేట్లు లేకుండా తిరిగే మొత్తం 738 వాహనాలపై చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను ప్రశ్నించి వారి వివరాలు నమోదు చేశారు. నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీషీటర్లు, అనుమానాస్పద వాహనాల కదలికలపై పోలీసులు ప్రత్యేకంగా నిఘా పెట్టారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, “జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించము. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం. నేరాల నియంత్రణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారు, రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము” అని స్పష్టం చేశారు.అదేవిధంగా యువత చట్టాలను గౌరవించి బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని సూచించిన ఎస్పీ, రోడ్లపై స్టంట్లు చేయడం, అధిక శబ్దాలతో వాహనాలు నడపడం, ప్రజలకు అసౌకర్యం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించి అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలపై వెంటనే సమాచారం అందించాలని, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆగమౌతున్న ఆటో డ్రైవర్లు..



**డీజిల్, పెట్రోల్, గ్యాస్ రేట్లు పెరగడం తో తీవ్ర ఇబ్బందులు**

**రాపిడో, ఓలా యాప్ ల వలన అటో ను నమ్ముకున్న డ్రైవర్ల కు ఉపాధి కరువు**

**మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రద్దు చేయాలి**

**ఆటో డ్రైవర్‌కు ఏటా రూ.12,000 ఆర్థిక సాయం చేస్తామని ఇచ్చిన హామీ నీ అమలు చేయాలి**



నల్లగొండ బ్యూరో, మే 31 (వార్తా వేదిక సూర్య )

చదువుకునే విద్యార్థులను స్కూలు కు తీసుకుపోవాలన్న, కూలీలు పనికి పోవాలన్న, మహిళలు సరుకులు తెచ్చు కోవాలన్నా ఆటో ఎక్కాల్సిందే, ఇప్పటికి చాలా గ్రామాల్లో బస్సు సౌకర్యం లేదు. ఇలాంటి గ్రామాల్లో ప్రజలు పట్టణాలకు పోవాలంటే ఆటో ను ఆశ్రయించాల్సిందే.. సమాజంలో ప్రతి ఒక్కరి రోజువారీ ప్రయాణాల్లో ఆటో డ్రైవర్లు పోషించే పాత్ర ఎంతో కీలకమైనది. రాత్రి అనక, పగలనక కష్టపడుతూ ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతారు. ఆటోను పేదవారి కారు గా పిలుచుకుంటాం. సమాజం లో ఎంతో మంది కార్పొరేట్ ఉద్యోగులు ఉన్నా, సామాన్యుడికి తక్కువ ఖర్చు లో అందుబాటులో ఉండే ఏకైక రవాణా మిత్రుడు ఆటో డ్రైవర్. ఒక కొత్త ఊరు, నగరానికి వెళ్లినప్పుడు మనకు ఏ అడ్రస్ తెలియకపోయినా, ఏ సందు ఎక్కడుందో స్పష్టంగా చెప్పి మనల్ని సరైన చోటుకి చేర్చేది ఆటో డ్రైవర్లే. గూగుల్ మ్యాప్స్ కంటే ముందే నగరాల భౌగోళిక రూపురేఖలపై వీరికి పూర్తి అవగాహన ఉంటుంది. అలాంటి ఆటో డ్రైవర్ అన్నల బతుకు బండి నడవడం రోజు రోజు కు కష్టంగా మారింది. ఒకవైపు ప్రభుత్వాలు డీజిల్, పెట్రోల్, గ్యాస్ రేట్లు పెంచుతున్నాయి. మరో వైపు ఉచిత బస్సు ప్రయాణం తో మహిళలు ఆటోలు ఎక్కడం లేదు. దీంతో పాటు రాపిడో, ఓలా, ఉబర్, జుగునో యాప్ లతో డ్రైవర్ అన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యం లో ఆదివారం నల్లగొండ పట్టణ ఆటో డ్రైవర్ అండ్ ఓనర్స్ అన్ని యూనియన్ల ఆటో డ్రైవర్లు ఎన్జీ కాలేజ్ గ్రౌండ్ లో సమావేశం నిర్వహించారు. డీజిల్, పెట్రోల్, గ్యాస్ రేట్లు పెరగడం తో ఆటో డ్రైవర్ల పై ఆర్థిక భారం పెరిగిందని, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని దీంతో పాటు కార్పొరేట్ సంస్థల ద్వారా వచ్చిన రాపిడో, ఓలా లాంటి యాప్ ల వలన ఆటోడ్రైవర్లకి తీవ్ర నష్టం జరుగుతున్నదని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేసారు. తక్షణమే ఈ యాప్ లను నల్గొండ పట్టణం లో నిషేధించాలని కోరుతున్నాం అన్నారు. ఈ సమావేశం లో కలెక్టర్ కి, ఆర్టీవో కి, మినిస్టర్ కి మెమో రాండం ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో నల్లగొండ పట్టణ వివిధ ఆటో సంఘాలు పాల్గొనడం జరిగినది. ఈ సమావేశానికి బి ఆర్ టి యు, టి ఏ టి యు ఆటో యూని యన్ నల్గొండ జిల్లా అధ్యక్షులు కలగోని యాదగిరి గౌడ్, రైల్వే స్టేషన్ అధ్యక్షులు యాదయ్య, నల్లగొండ పట్టణ బస్టాండ్ అధ్యక్షులు లింగరాజు, అసలం పానగల్ అధ్యక్షులు బొంత రోశయ్య, మహేశ్వరి బస్టాండ్ బయట అధ్యక్షులు దశరథ, చౌరస్తా మతిన్, క్లాక్ టవర్ శంకర్, రాంబాబు,చోటు తదితరులు పాల్గొన్నారు.

**ఉచిత బస్సు ప్రయాణం రద్దు చేయాలి.. పెంచిన డీజిల్, పెట్రోలు ధరలు తగ్గించాలి**

**ఆటో డ్రైవర్ల కు కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరానికి రూ.12000 ఇస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలి : జాల భిక్షం, ఆటో డ్రైవర్ నార్కట్ పల్లి**



3 లక్షలు పెట్టి ఆటో తీసుకున్న, 40 నెలలు ఫైనాన్స్ పెట్టుకుంటే ఆటో కి కిస్తీలు కట్టుకోవడానికి కూడా పైసలు సరిపోవడం లేదు. ఫ్రీ బస్ లు లేనప్పుడు ఆటో లు బాగా నడిచేవి, ప్రస్తుతం నడవటం లేదు. ఫైనాన్స్ వాళ్ళు ఆటో తీసుకుపోయే పరిస్థితి వచ్చింది. ఆటో డ్రైవర్ల కు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 12000 సంవత్సరానికి ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇంత వరకు అమలు చేయలేదు. ఆటో డ్రైవర్లు భార్య, పిల్లల్ని సుఖంగా సాధుకొని మూడు పూటల తిండి పెట్టి, బండి కి కిస్తీలు సక్రమంగా నెల , నెల కట్టుకోవాలంటే ఫ్రీ బస్సును రద్దు చేయాలి. ప్రస్తుతం డీజీలు ధర రూ.103 నుంచి రూ.106 లు ఉంది. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి. ముఖ్యంగా నార్కట్ పల్లి కామినేని హాస్పిటల్ దగ్గర నుంచి బస్టాండ్ వరకూ, ఫ్రీ బస్ లో ప్రయాణికులను ఎక్కించుకోకుంటే నార్కట్ పల్లి లోని ఆటో డ్రైవర్ల కు మేలు జరుగుతుందని తెలిపారు.



# బీజేపీ రైతు యాత్ర పై ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఘాటు వ్యాఖ్యలు

నల్లగొండ బ్యూరో, మే 31 (వార్తా వేదిక సూర్య )

బి . జె పి రాష్ట్రంలో చేపడుతున్న “రైతు యాత్ర” పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ప్రభుత్వ విప్ ఉ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విమర్శించారు. సి.ఎల్. పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి , పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుండి ధాన్యాన్ని వేగంగా, పారదర్శకంగా కొనుగోలు చేస్తోందన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వాస్తవాలను పక్కనపెట్టి రాష్ట్ర ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. బి జె పి చేపడుతున్నది “రైతు యాత్ర”నా, లేక “రాజకీయ యాత్ర”నా అని ప్రశ్నించారు. రైతులకు బిజెపి ఏం భరోసా ఇస్తోందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తూ, తెలంగాణ రైతుల విషయంలో మాత్రం వివక్ష చూపుతోందని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తోందని తెలిపారు. తన నకిరేకల్ నియోజకవర్గంలోని రెండు మండలాల్లో ఇప్పటికే పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొంతమంది రైస్ మిల్లర్లతో కుమ్మక్కై అనేక అక్రమాలు, దందాలు జరిగాయని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పారదర్శకంగా వ్యవహరిస్తోందన్నారు. బిజెపి కి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని, రాష్ట్రానికి చెందిన 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ తెలంగాణకు సాధించింది శూన్యమని విమర్శించారు. రైతుల పేరుతో చేపడుతున్న బిజెపి యాత్రలను రైతులు నమ్మే పరిస్థితి లేదని, రైతు సంక్షేమం కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికే ప్రజలు మద్దతుగా నిలుస్తారని వేముల వీరేశం పేర్కొన్నారు.

# హెచ్.ఎం టీవీ ఛానల్ ఆధ్వర్యం లో ఆర్గానిక్ మేళా

నల్లగొండ బ్యూరో, మే 31 (వార్తా వేదిక సూర్య )





హెచ్.ఎం టీవీ ఛానల్ ఆధ్వర్యం లో నిర్వహించిన ఆర్గానిక్ మేళా కార్యక్రమం లో టి.పి.సి.సి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ తో కలిసి ప్రభుత్వ విప్ ఉ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేంద్రీయ వ్యవసాయం ప్రాముఖ్యత, రైతులకు ఆర్గానిక్ వ్యవసాయం ద్వారా లభించే ప్రయోజనాలు, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తుల వినియోగంపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలను వీరు పరిశీలించారు. స్టాల్స్ వద్ద రైతులతో, ఉత్పత్తిదారులతో మాట్లాడి వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీగూడాలో ఘనంగా ప్రధాని మోదీ 134వ మన్ కీ బాత్ కార్యక్రమం వీక్షణ

రాజేంద్రనగర్, మే 31 ( వార్త వేదిక సూర్య ) :

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 134వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని లక్ష్మీగూడా వాంబే కాలనీలో ఆదివారం బీజేపీ నాయకులు వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశాభివృద్ధి, యువత సాధికారత, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ భారత్ వంటి అంశాలపై చేసిన ప్రసంగాన్ని కార్యకర్తలు శ్రద్ధగా ఆలకించారు. ప్రజల్లో జాతీయ చైతన్యం పెంపొందించేందుకు మన్ కీ బాత్ కార్యక్రమం దోహదపడుతోందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో అడికే మహేందర్, ఆడికే రాజు, బల్ల శ్రీనివాస్ యాదవ్, అరుణ్ కుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంపుటి : 2 సంచిక: 12 వార్త వేదిక సూర్య
హైదరాబాద్ సోమవారం, జూన్ 01, 2026



## ప్రజల భాగస్వామ్యంతో వికసిత్ భారత్ నిర్మాణం

### -మన్ కీ బాత్‌లో ప్రధాని దిశానిర్దేశం నియోజకవర్గం ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి

రాజేంద్రనగర్, మే 31 ( వార్త వేదిక సూర్య ) :



రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలర్ దేవ్‌పల్లి కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు గోద పాండు యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయిబాబా నగర్‌లో బీజేపీ సీనియర్ నాయకుడు సంతు గౌడ్ నివాసంలో ప్రధాని నరేంద్ర మోడీ 134వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఘనంగా వీక్షించారు. బూత్ నంబర్లు 352, 353, 354 పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్ రెడ్డి బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం, యువత సాధికారత, స్వచ్ఛత మరియు పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై చేసిన ప్రసంగాన్ని శ్రద్ధగా విన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బి. నర్సింహ, రమేష్ రెడ్డి, ఎన్ను శంకర్ రెడ్డి, రామారావు, శేఖర్, గురుస్వామి కిరణ్, రాజలింగం, రమేష్ యాదవ్, విజయ్, చింటూ రెడ్డి, మహిళా నాయకులు, డివిజన్ నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## అత్తాపూర్‌లో ఘనంగా మన్ కీ బాత్ 134వ భాగం వీక్షణ

### - సమాజ సేవే నిజమైన దేశసేవ అని చాటిన మన్ కీ బాత్ : కార్యదర్శి సాబాద విజయ్ కుమార్

రాజేంద్రనగర్, మే 31 ( వార్త వేదిక సూర్య ) :



అత్తాపూర్‌లోని బూత్ నంబర్ 235 పరిధిలో డివిజన్ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు డాకా కృష్ణవేణి నివాసంలో ఆదివారం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన మన్ కీ బాత్ 134వ భాగం కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా కార్యాలయ కార్యదర్శి సాబాద విజయ్ కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు ప్రధానమంత్రి ప్రసంగంలోని ముఖ్యాంశాలను ఆసక్తిగా వీక్షించారు. ప్రధాని మోదీ తన ప్రసంగంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు దేశహితం, సమాజహితం కోసం చేస్తున్న విశిష్ట సేవలను ప్రస్తావిస్తూ, అలాంటి స్ఫూర్తిదాయక కథనాలు ప్రతి భారతీయుడికి కొత్త ఉత్సాహాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. ఇటీవల ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరిగిన జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో సుమారు 800 మంది క్రీడాకారులు పాల్గొనగా, నాలుగు విభాగాల్లో జాతీయ రికార్డులు బద్దలైన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా గురువిందర్ సింగ్, విశాల్ టీకే, తేజస్విని శంకర్, దేవ్ మీనా, కుల్దీప్ కుమార్ సాధించిన విజయాలను అభినందించారు. ముఖ్యంగా పురుషుల 100 మీటర్ల పరుగుపందెంలో కేవలం రెండు రోజుల వ్యవధిలోనే జాతీయ రికార్డు మూడుసార్లు బద్దలవడం భారత క్రీడారంగానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ ఘనతను గురువిందర్ వీర్ సింగ్, అనిమేష్ కుజూర్ సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాకా రామ్ రెడ్డి, రవి కిరణ్, యశస్విని, భాగ్య పాల్గొన్నారు

# జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతరం అండ గా నిలిచిన అరుదైన వేదిక తెలంగాణ జర్నలిస్టు ఫోరం (టీజేఎ ఫ్)





## టియూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గుండగోని జయశంకర్ గౌడ్

నల్లగొండ బ్యూరో, మే 31 (వార్తా వేదిక సూర్య )

తెలంగాణ రాష్ట్ర ఉద్యమ చరిత్రలో ఎన్నో సంస్థలు, ఎన్నో వేదికలు ఏర్పడ్డప్ప టి కీ ఉద్యమ ఆవశ్యకత నుంచి పుట్టి, రాష్ట్ర సాధన తర్వాత కూడా సమాజానికి, ముఖ్యంగా జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతరం అండ గా నిలిచిన అరుదైన వేదికల్లో తెలంగాణ జర్నలిస్టు ఫోరం (టీజేఎ ఫ్) ఒకటని, "తెలంగాణ కోసమే తె లంగాణ జర్నలిస్టు" అనే నినాదం తో గుప్పెడు మంది జర్నలిస్టులతో ప్రారంభమైన ఈ వేదిక, తర్వాత తెలంగాణ ఉద్యమానికి మేధో శక్తి గా, ఆత్మగౌరవ స్వరంగా, కలం యోధుల సంఘటిత శక్తిగా ఎదిగిందని టియుడబ్ల్యూజే నల్లగొండ జిల్లా అధ్యక్షుడు గుండగోని జయ శంకర్ గౌడ్ పేర్కొన్నారు. తెలంగా ణ అనే పదమే అనేక వేదికల్లో ని రాకరణకు గురైన రోజుల్లో ప్రధాన మీడియా సంస్థల్లో తెలంగాణ స మస్యలకు సరైన ప్రాధాన్యం లేక పోవడం, ఉద్యమ వార్తలను వక్రీక రించడం, ప్రాంతీయ అన్యాయా లపై చర్చలు లేకపోవడం వంటి పరిస్థితుల్లో తెలంగాణ భావజాలం కలిగిన జర్నలిస్టులు ఒక ప్రత్యా మ్నాయ వేదిక అవసరాన్ని గుర్తించగా అలా పుట్టిందే టీజేఎఫ్ అని గుర్తు చేశారు. తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం 25 వసంతాల సందర్భంగా టి యు డబ్ల్యూ జే జిల్లా శాఖ ఆధ్వర్యంలో నల్లగొండ పెద్ద గడియారం సెంటర్ లో కొవ్వొ త్తుల ప్రదర్శన నిర్వహించడంతో పాటు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించడం జరిగింది.

జిల్లాల నుంచి రాజధాని వరకు తె లంగాణ స్వరాన్ని బలంగా వినిపించిందని, రైతుల ఆత్మహత్యలు, వి ద్యార్థుల ఉద్యమాలు, ఉద్యోగుల దీక్షలు, సింగరేణి కార్మికుల పోరా టాలు, ఫ్లోరోసిస్ బాధలు, సాగునీ టి సమస్యలు, ప్రాంతీయ వివక్ష... ఇలా తెలంగాణ సమాజంలోని ప్ర తి బాధను వార్తగా, ప్రతి ఆవేదన ను ఉద్యమ అజెండాగా మార్చిన వేదికగా టీజేఎఫ్ నిలిచిందన్నారు. ఈ ఉద్యమానికి ప్రధాన సారథిగా నిలిచిన వ్యక్తి అల్లం నారాయణ నాయకత్వంలో టీజేఎఫ్ కేవలం జ ర్నలిస్టు సంఘం కాకుండా తెలం గాణ ఉద్యమంలో కీలక మేధో వేది కగా రూపుదిద్దుకుందన్నారు. వార్త అంటే కేవలం సమాచారమేగాదు... అది సమాజ చైతన్యానికి ఆయుధ మని ఆయన నిరూపించారన్నా రు. తెలంగాణ ఉద్యమ సమయం లో టీజేఎఫ్ నిర్వహించిన సమావే శాలు, చర్చలు, ర్యాలీలు, నిరసన లు ఉద్యమానికి బలమైన భావజా ల పునాది వేశాయని వివరించారు. తెలంగాణ కోసం కలంతోనే కాదని, అవసరమైనప్పుడు రోడ్లపైకి వచ్చి పోరాడిన అరుదైన జర్నలిస్టు ఉద్యమ వేదిక టీజేఎఫ్ అని, తెలంగాణ ఉద్యమ కాలంలో టీజేఎఫ్ జర్నలిస్టులు కేవలం వార్తలకే పరిమితం కాలేదు. తెలంగాణ ఆవేదనను తమ రచనల్లో ప్రతిబింబించడమే కాకుండా, ఉద్యమ రణరంగంలో ప్రత్యక్షంగా అడుగుపెట్టారని గుర్తు చేశారు. ఉద్యోగ భద్రతను, యాజ మాన్య ఒత్తిడులను, రాజకీయ బె దిరింపులను లెక్కచేయకుండా తె లంగాణ కోసం రోడ్లెక్కి నిరసనలు చేపట్టారు. ధర్నాలు, ర్యాలీలు, మానవహారాలు, ఆందోళనలు, చ ర్చావేదికలు నిర్వహిస్తూ తెలంగా ణ ఉద్యమానికి మేధోబలంతో పా టు ప్రత్యక్ష ఉద్యమ బలం కూడా అందించారన్నారు. అనేక సంద ర్భాల్లో పోలీసులు అడ్డుకోవడం, కేసులు నమోదు చేయడం, మీడి యా యాజమాన్యాల ఒత్తిడులు వచ్చినా వెనక్కి తగ్గలేద విద్యార్థి ఉద్యమాలు, ఉ ద్యోగుల సమ్మెలు, సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్, రైతుల ఆందోళనలు, సింగరేణి కార్మికుల పోరాటాలు... ఇలా తెలంగాణ సమాజం ఎక్కడ ఉద్యమించిందో అక్కడ టీజేఎఫ్ జర్నలిస్టుల స్వరం వినిపించిందని తెలిపారు.

తెలంగాణ కోసం రాసిన ప్రతి అక్ష రం వెనుక ఒక ఆవేదన ఉందని, ప్రతి నిరసన వెనుక ఒక ఆత్మగౌర వం ఉందని, ఆ రెండింటినీ కలిపి ఉ ద్యమ శక్తిగా మార్చిన అరుదైన జర్నలిస్టుల వేదికే తెలంగాణ జర్న లిస్టు ఫోరం అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేంత వర కు టీజేఎఫ్ ఒక ఉద్యమ వేదికగా నిరంతరం పోరాడింది. రాష్ట్రం ఏ ర్పడిన తర్వాత కూడా ఆ స్ఫూర్తి ఆగిపోకుండా జర్నలిస్టుల హక్కు లు, సంక్షేమం, భద్రత కోసం ప్రత్యే కంగా ఒక ట్రేడ్ యూనియన్ అవ సరమని భావించి టీజేఎఫ్ నుంచే తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడ బ్ల్యూజే) రూపుదిద్దుకుందని గుర్తు చేశారు. ఉద్యమ వేదిక నుంచి హ క్కుల వేదికగా మారిన ఈ పరిణా మం తెలంగాణ జర్నలిస్టు చరి త్ర లో ఒక కీలక అధ్యాయమని చె ప్పారు. గుప్పెడు మంది కలం యో ధులు ప్రారంభించిన ఉద్యమశీ, నే డు వేలాది జర్నలిస్టులకు స్ఫూర్తి అని , తెలంగాణ రాష్ట్ర సాధనలో కలంతో పోరాడిన ఆతరం జర్నలి స్టుల సేవలను గుర్తుచేసుకునే రోజ ని, తెలంగాణ కోసం వార్త రాసిన ప్రతి కలం వెనుక ఒక ఉద్యమ గుం డె చప్పుడు ఉందని, ఆ చప్పుడికి రూపం ఇచ్చిన వేదికే తెలంగాణ జర్నలిస్టు ఫోరం అని కొనియాడా రు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకు లు విజయ్ కుమార్ మాట్లాడుతూ..టీయూడబ్ల్యూజే ద్వారా జర్నలిస్టు ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీ సుకెళ్లడం, జిల్లాల వారీగా విలేకరు లను ఐక్యం చేయడం, మీడియా కార్మికుల హక్కుల కోసం పోరాటం చేయడం వంటి కార్యక్రమాలు బలంగా కొనసాగాయని తెలిపా రు. జర్నలిస్టులపై ఎక్కడ దాడులు జరిగినా, ఎక్కడ అన్యాయం జరిగి నా స్పందించే శక్తిగా ఈ సంఘం ఎదిగిందని, గ్రామీణ విలేకరుల నుంచి పెద్ద మీడియా సంస్థల జ ర్నలిస్టుల వరకు అందరికీ ఒక అం డగా నిలబడే ప్రయత్నం చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వా త అల్లం నారాయణ తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా సుదీర్ఘ కాలం పనిచేశారని దా దా పు పదేళ్లపాటు ఆ బాధ్యతల్లో కొనసాగుతూ తెలంగాణ జర్నలిజం అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. ముఖ్యంగా జర్న లిస్టుల సంక్షేమంపై ఆయన చూపి న శ్రద్ధ ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

అప్పటి ముఖ్యమంత్రి కే. చంద్రశే ఖర్ రావు ను ఒప్పించి జర్నలిస్టుల సంక్షేమం కోసం కోట్లాది రూపాయ ల నిధి ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఈ ఫండ్ ద్వారా మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సా యం అందించడం, వారి పిల్లల విద్యకు సహాయం చేయడం, అ నారోగ్య సమస్యల్లో అండగా ని లవడం వంటి కార్యక్రమాలు అమ లులోకి వచ్చాయని తెలిపారు. జ ర్నలిస్టు కుటుంబం కష్టాల్లో పడితే ప్రభుత్వం, సంఘం తమ వెంటే ఉ న్నాయనే నమ్మకాన్ని కల్పించడం లో ఈ సంక్షేమ కార్యక్రమాలు కీల కంగా మారాయని, తెలంగాణ జ ర్నలిస్టు ఉద్యమం అంటే కేవలం రాజకీయ ఉద్యమం మాత్రమే కా దని,విఅది ఆత్మగౌరవం కోసం, వృ త్తి గౌరవం కోసం, పత్రికా స్వేచ్ఛ కో సం సాగిన పోరాటం కూడా అని అన్నారు. ఈ ప్రయాణంలో టీజే ఎఫ్ ఒక చరిత్రను సృష్టించిందని, ఉద్యమ కాలంలో తెలంగాణ స్వ రాన్ని వినిపించిన ఈ వేదికరాష్ట్రం ఏర్పడిన తర్వాత జర్నలిస్టుల సం క్షేమాన్ని కాపాడే దిశగా అడుగులు వేసిందన్నారు. నేడు కూడా తెలం గాణలో జర్నలిస్టులపై దాడులు జరిగినప్పుడు, చిన్న పత్రికలు ఇ బ్బందులు ఎదుర్కొన్నప్పుడు, గ్రా మీణ విలేకరులు సమస్యల్లో చి క్కుకున్నప్పుడు టీయూడబ్ల్యూజే స్పందిస్తూనే ఉందని, ఆ స్ఫూర్తి, ఆ ఆవేశం, ఆ బాధ్యత అన్నీ టీ జేఎఫ్ ఉద్యమ గర్భం నుంచే వచ్చి నవే అని గుర్తు చేస్తూ మే 31 టీజే ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం కేవలం ఒక సంఘం వార్షికోత్సవం కాదని, తెలంగాణ జర్నలిజం ఆత్మగౌరవ యాత్రకు గుర్తుగా నిలిచే రోజన్నా రు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూ జే జిల్లా ప్రధాన కార్యదర్శి వీరస్వా మి, జిల్లా నాయకులు ఫహిమొద్దీ న్, జనార్ధన్ రెడ్డి, దీకొండ రవిశంక ర్, పిల్లలమర్రి శ్రీనివాస్, ఎలక్ట్రాని క్ మీడియా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటరెడ్డి, జాన య్య, నల్లగొండ డివిజన్ యూని యన్ నాయకులు నీలం వెంకట మధు, దండంపల్లి రవికుమార్ గౌ డ్, మధు, వీడియో జర్నలిస్టుల అసోసి యేషన్ జిల్లా అధ్యక్ష కార్య దర్శులు అల్లి మల్లికార్జున్, శ్రీనివా స్ గౌడ్, ఫోటో జర్నలిస్టు అసోసి యేషన్ అధ్యక్ష కార్యదర్శులు కం ది వేణు, ముచ్చర్ల విజయ్, ముచ్చ ర్ల శ్రీనివాస్ గౌడ్, చిన్న పత్రికల సం ఘం తరపున మీసాల నరహరి, న వీన్, మధు, సైదులు, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డి చొరవతో కిస్మత్‌పూర్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో విద్యుత్ పనులు ప్రారంభం



రాజేంద్రనగర్, మే 31 ( వార్త వేదిక సూర్య ) :

రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కిస్మత్‌పూర్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో విద్యుత్ సౌకర్యాల ఏర్పాటుకు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. కాలనీలో కరెంట్, తాగునీరు, రోడ్లు వంటి కనీస మౌలిక వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు రెండు నెలల క్రితం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జ్ కార్తీక్ రెడ్డి, స్వామిని కలిసి సమస్యలను వివరించారు.

కాలనీవాసుల విజ్ఞప్తిపై వెంటనే స్పందించిన సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డి సంబంధిత విద్యుత్ శాఖ, హౌసింగ్ శాఖ అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. వారి చొరవతో పెండింగ్‌లో ఉన్న ఫైల్‌కు అనుమతులు మంజూరవడంతో విద్యుత్ పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం కాలనీలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్‌ల నిర్మాణం, వైరింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. త్వరలోనే విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి రానుండటంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డి, సంబంధిత అధికారులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు



## ఆలు లేదు చూలు లేదు.. ఇహెచ్ఎస్ కటింగ్ షురూ

### ఆర్థిక శాఖ అత్యుత్సాహాన్ని తీవ్రంగా ఖండించిన టిఎస్ యుటిఎఫ్ నల్లగొండ జిల్లా కమిటీ

నల్లగొండ బ్యూరో, మే 31 (వార్తా వేదిక సూర్య )

ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈ. హెచ్. సి.టి) విధివిధానాలు ఇంకా ఖరారు కాలేదు, హాస్పిటల్స్ తో ఒప్పందం కుదిరింది లేదు. ప్యాకేజి రేట్లు నిర్ణయించలేదు. డిజిటల్ హెల్త్ కార్డులు ఇవ్వనేలేదు. ఈహెచ్ఎస్ చందా 1.5% మినహాయింపు పై జి.ఓ కూడా ఇవ్వలేదు. కానీ ఆర్థిక శాఖ అత్యుత్సాహంతో ఈహెచ్ఎస్ చందా పేరిట ఉద్యోగుల మే నెల వేతనాల్లో 1.5% కోత విధించటాన్ని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) నల్లగొండ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బక్క శ్రీనివాసా చారి, పెరుమాళ్ళ వెంకటేశం లు తీవ్రంగా ఖండించారు. విధివిధానాల గురించి అడిగితే ఆరోగ్య శాఖ ఇస్తుందని సమాధానం చెప్పిన ఆర్థిక శాఖ అధికారులు ఆ విధివిధానాలు లేకుండానే వేతనాల్లో కోత ఎలా పెడతారని ప్రశ్నించారు. ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబ సభ్యుల వివరాలు ఐఎఫ్ఎంఐఎస్ సైట్ లో ఈరోజు వరకు నమోదు చేయాలని గడువు విధించి, నిన్నటిదాకా వెబ్ సైట్ లో మార్పులు చేస్తూనే ఉన్నారు, నిన్న రాత్రి ఫోటోల అప్లోడ్ కు అవకాశం ఇచ్చారు. వివరాలు పూర్తిగా తీసుకోనే లేదు. జి. ఓ. 174 (పాత నిబంధన) ప్రకారం భార్యాభర్తలు ఉద్యోగులైతే ఒక్కరే చందా చెల్లించాలి. ఇప్పుడు ఇద్దరి నుంచి మినహాయించారు. ఈనెల 31 వ తారీకు రిటైర్ అయ్యే వాళ్ల నుంచి కూడా 1.5 శాతం కట్ చేయడం ఎంతో విడ్డూరంగా ఉంది.

ఆధారిత కుటుంబ సభ్యులపై పూర్తి స్పష్టత రానే లేదు. నిజానికి ఉద్యోగుల, పెన్షనర్ల ఆరోగ్య సంరక్షణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. కానీ కార్పొరేట్ హాస్పిటల్స్ లో వైద్యం ఖరీదైన సమయంలో ఉద్యోగులు కూడా కొంత భరించాలని ప్రభుత్వం కోరినప్పుడు ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలు అంగీ కరించాయి. అయినా వేతనంలో 1.5% కోత నిర్ణయం పట్ల ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారు. వారిలో ఉన్న సందేహాలను తొలగించి ఆరోగ్య పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాల్సిన సమయంలో అందుకు తగిన చర్యలు తీసుకోకుండా ఇంత హడావుడిగా వేతనాల్లో కోత విధించడం ఉద్యోగుల్లో పలు అనుమానాలకు తావిస్తున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి వెంటనే జోక్యం చేసుకొని వేతనాల్లో కోతలు నిలివేయాలని టిఎస్ యుటిఎఫ్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బక్క శ్రీనివాసా చారి,

ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం లు డిమాండ్ చేశారు. ఆర్థిక శాఖ తీసుకున్న ఏకపక్ష నియంతృత్వ నిర్ణయాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం అభాసుపాలవుతుందని ప్రభుత్వానికి ఉద్యోగులకు మధ్య దూరం పెరుగుతుందని వారు హెచ్చరించారు.

## పుప్పాలగూడలో వైభవంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం



రాజేంద్రనగర్, మే 31 ( వార్త వేదిక సూర్య ) :



వి ఆర్ 4 సహయోగ్ చారిటేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌర్ణిమ సందర్భంగా ఆదివారం పుప్పాలగూడ మహావీర్ హనుమాన్ మందిరంలో సామూహిక శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఉచితంగా పూజా సామగ్రిని సమకూర్చగా, గణపతి పూజ, గౌరమ్మ పూజ, నవగ్రహ పూజ, అష్టదిక్పాలక పూజలతో పాటు భక్తులు తమ ఇష్ట ధాన్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పురోహితుడు మండువ మధుసూదన శర్మ ఆధ్వర్యంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం సంప్రదాయబద్ధంగా జరిగింది. ఈ విషయాన్ని మేనేజింగ్ ట్రస్టీ అందే లక్ష్మణ్‌రావు వెల్లడిస్తూ, వందకు పైగా దంపతులు కుటుంబ సమేతంగా వ్రతంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారని తెలిపారు. ప్రతి పౌర్ణిమ సందర్భంగా పుప్పాలగూడ పంచకమిటీ లోధ క్షత్రియ సదర్ పంచాయతీ ఆధ్వర్యంలో దేవాలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ నిర్వహిం చడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పంచకమిటీ లోధ క్షత్రియ సదర్ పంచాయతీ కమిటీ సభ్యులు, రాజన్ భాయి తదితరులు పాల్గొన్నారు.

సంపుటి : 2 సంచిక: 12 వార్త వేదిక సూర్య
హైదరాబాద్
సోమవారం, జూన్ 01, 2026



# యువత భవిష్యత్తే దేశ భవిష్యత్తు

- సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి
- పహాడీ షరీఫ్ పోలీసుల ఆధ్వర్యంలో యువత, తల్లిదండ్రులతో అవగాహన సమావేశం

రాజేంద్రనగర్, మే 31 ( వార్త వేదిక సూర్య ):

బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలంటే తల్లిదండ్రుల పర్యవేక్షణతో పాటు సరైన మార్గదర్శకత్వం అవసరమని పహాడీ షరీఫ్ పోలీస్ సిబ్బంది పేర్కొన్నారు. పహాడీ షరీఫ్ పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో శ్రీరామ కాలనీలో నివసించే యువత మరియు వారి తల్లిదండ్రులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మణ్, ఏఎస్ఐ నరసింహ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న నేరాలు, ముఖ్యంగా సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్‌లో అధిక సమయం గడపడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, వారి ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ మంచి విలువలు, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. యువత తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

# విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్,మే 31 ( వార్త వేదిక సూర్య ) :





శంషాబాద్ మండలంలోని పెద్ద తుప్పర గ్రామపంచాయతీ లీగ్ సీజన్-3 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ . ప్రకాశ్ గౌడ్ హాజరై విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతుల చెక్కులను అందజే శారు. టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన జట్లతో పాటు ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎమ్మెల్యే అభినందించారు. పార్టీ నాయకుడు చంద్రారెడ్డితో కలిసి విన్నర్, రన్నరప్ జట్లకు ట్రోఫీలు ప్రదానం చేసి క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన బుద్ధం మహేష్ యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించిన ఎమ్మెల్యే, గ్రామ అభివృద్ధితో పాటు యువత క్రీడల్లో రాణించేలా ప్రోత్సాహం అందించడం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రేణిగుంట్ల గణేష్ గుప్తా, నీరటి రాజు ముదిరాజు, సర్పంచ్ పాలమాకుల కోటేష్, ఉపసర్పంచ్ గూడెపు కుమార్, మాజీ సర్పంచ్ రమేష్, తేరుపల్లి యాదయ్య, మైల రాములు, అంజయ్య యాదవ్, దిద్యాల అశోక్, జంగయ్య, రవి, మహమ్మద్ అస్లం, విద్యాచరణ్, ఇంద్రారెడ్డి, బుద్ధం అశోక్, ఉప్పరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్ఫూర్తి శిఖరాలు : గురువుకు గౌరవం... ప్రతిభకు పురస్కారం!



- గండిపేట మండల విద్యా అధికారి నిరంజన్‌కు ఘన వీడ్కోలు
- పదో తరగతి టాపర్లకు సత్కారం, ఆర్థిక సహాయం

ప్రతిభావంతురాలైన విద్యార్థిని స్వాతికి 35 వేల సాయం అందజేత





రాజేంద్రనగర్, మే 31 ( వార్త వేదిక సూర్య ) :

ఒక మంచి గురువు సమాజానికి దిక్సూచి... ఒక నిరుపేద విద్యార్థి సాధించే విజయం దేశానికి భవిష్యత్తు! నిరంతరం విద్యా వెలుగులు పంచిన ఒక నిగర్వి రిటైర్మెంట్ వేడుక... కటిక పేదరికంలోనూ మార్కుల వర్షం కురిపించిన విద్యార్థుల సత్కార సభగా మారితే? ఆ అద్భుత దృశ్యానికి వేదికైంది మణికొండ జిల్లా పరిషత్ హైస్కూల్. గండిపేట మండల విద్యాధికారి గా, మణికొండ జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులుగా సేవలందించిన నిరంజన్ పదవీ విరమణ చేశారు. ఉద్యోగ విరమణ అనేది ఒక బాధ్యత ముగింపు మాత్రమే కాదు, ఆయన వెలిగించిన వందలాది విద్యార్థుల జీవితాల ప్రస్థానానికి అది ఆరంభం. ఆయన సేవలను కొనియాడుతూ స్థానిక నాయకులు కే. రామకృష్ణ రెడ్డి , యాలాల నరేష్ , ఏర్పుల కుమార్ , శ్రవణ్ కుమార్ , శివగంగ సంతోష్ ఘనంగా వీడ్కోలు పలికారు. గురువు స్థానానికి వారు ఇచ్చిన గౌరవం నేటి సమాజానికి ఆదర్శం. సౌకర్యాలు ముఖ్యం కాదు, సాధించాలనే సంకల్పం ఉంటే చాలని నిరూపించారు ఈ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు. ఈ ఏడాది పదో తరగతిలో 500కి పైగా మార్కులు సాధించి తామేంటో నిరూపించుకున్నారు. పాఠశాల టాపర్లుగా నిలిచిన దివ్య, భానుప్రసాద్ గౌడ్, వేంకట సాత్వికల ప్రతిభకు మణికొండ గాయత్రి బ్రాహ్మణ ఐక్య వేదిక సంఘం వారు ఆర్థిక సాయం అందించి 'మేమున్నాం' అంటూ భుజం తట్టారు. సోషల్ స్టడీస్ సబ్జెక్టులో 100కి 100 మార్కులు సాధించిన విద్యార్థులు, వారికి దిశా నిర్దేశం చేసిన ఉపాధ్యాయుల కృషి అసాధారణమైనది. శ్రమ నీదైతే, విజయంనీ దరి చేరుతుందని వీరు నిరూపించారు!గత ఏడాది ఇదే స్కూల్లో చదివి, ప్రస్తుతం క్షేత్ర జూనియర్ కాలేజీలో ఇంటర్ (ఎంపీసీ ) ఫస్టియర్ చదువుతున్న స్వాతి కథ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించి రికార్డు సృష్టించింది. పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదని భావించిన దాతలు ఆమెకు కొండంత అండగా నిలిచారు. కే. రామకృష్ణ రెడ్డి రూ. 25,000 చెక్కును అందజేశారు. సామాజికవేత్త మంచికంటి సంతోష్ కుమార్ రూ. 10,000 చెక్కును అందించారు. రాబోయే రోజుల్లో స్వాతి ఉన్నత చదువులకు ఎంత ఖర్చైనా భరిస్తాం అని దాతలు ప్రకటించిన క్షణం... ఆ తల్లిదండ్రుల కళ్ళల్లో ఆనంద బాష్పాలు నిండాయి. సాయం చేసే హృదయం ఉంటే, ప్రతిభ గల ఏ బిడ్డ చదువు ఆగిపోదని ఈ సంఘటన నిరూపించింది. విద్యార్థిని తల్లిదండ్రులు దాతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం విద్యార్థులలో ఎంతో స్ఫూర్తిని నింపిందని పాఠశాల ఉపాధ్యాయ బృందం పేర్కొంది.

# మానసిక సమస్యలకు టెలి మానస్ భరోసా



## 14416 హెల్ప్‌లైన్‌తో 24 గంటల సేవలు

రాజేంద్రనగర్, మే 31 ( వార్త వేదిక సూర్య ) :

మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సకాలంలో సలహాలు, మార్గదర్శకత్వం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టెలి మానస్ హెల్ప్‌లైన్ (14416) సేవలు రాష్ట్రవ్యాప్తంగా 24 గంటలు అందుబాటులో ఉన్నాయని టెలి మానస్ సూపర్వైజర్, ప్రముఖ సైకాలజిస్ట్ జవహర్లాల్ నెహ్రూ తెలిపారు. ఆదివారం ఉదయం పెద్దతాళ్లకుంట పార్కులో అహం సూత్ర సోషల్ ల్యాబ్ మరియు స్పార్క్ కమ్యూనిటీ హెల్త్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మానసిక ఆరోగ్య అవగాహన కార్నర్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో రోజురోజుకు మానసిక ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు తక్షణ మానసిక ఆరోగ్య సహాయం అందించేందుకు టెలి మానస్ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

మానసిక సమస్యలపై సలహాలుకావాలనుకున్నవారు, భావోద్వేగ పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారు లేదా మానసికంగా ధైర్యం, భరోసా పొందాలను కునేవారు 14416 నంబర్‌కు ఎప్పుడైనా కాల్ చేసి నిపుణుల సేవలను పొందవచ్చని సూచించారు.

సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాల అధిక వినియోగం వల్ల మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడటంతో పాటు సామాజిక సమస్యలు కూడా తలెత్తుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్‌ఫోన్లు, ఇతర గ్యాడ్జెట్లను అవసరానికి తగ్గట్టుగా మాత్రమే వినియోగించాలని, అధిక వినియోగం వల్ల ఒత్తిడి, ఏకాగ్రత లోపం, నిద్ర సమస్యలు వంటి ఇబ్బందులు పెరుగుతున్నాయని వివరించారు.

ఈ కార్యక్రమంలో ఆర్థిక విశ్లేషకులు ప్రొఫెసర్ కనకయ్య, మల్లికార్జున్ రెడ్డి, పెద్దతాళ్లకుంట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి దుర్గాదాస్, అహం సూత్ర సోషల్ ల్యాబ్ వ్యవస్థాపకులు రాచూరి అజిత్, సామాజిక కార్యకర్త, జర్నలిస్టు మధు తదితరులు పాల్గొన్నారు.



# సీతాఫల్మండిలో బిఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

సికింద్రాబాద్, మే 31(వార్త వేదిక సూర్య)

సీతాఫల్మండి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ అధ్వర్యంలో బౌద్ధనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... జూన్ 03వ తేదిన జరగబోయే నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నారని పేర్కొన్నారు. అనంతరం పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయ తదితర అంశాల పై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... డివిజన్ ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, రాజేందర్, రాజ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు

# ఉపాధ్యాయుల జీతాల్లో కోతలు సమంజసం కాదు: టీపీయూఎస్ డిమాండ్

రాజేంద్రనగర్, మే 31 ( వార్త వేదిక సూర్య ) :



ఉపాధ్యాయుల జీతాల నుంచి హెల్త్ కార్డు ప్రీమియం పేరుతో కోతలు విధించడం సమంజసం కాదని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు మదగని బాలకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. హెల్త్ కార్డులకు సంబంధించిన విధివిధానాలను ప్రకటించకుండా, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండానే ప్రీమియం వసూలు చేయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. హెల్త్ కార్డులు అధికారికంగా జారీ చేయకముందే, పథకంపై పూర్తి సమాచారం అందించకుండా జీతాల్లో కోతలు విధించడం ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తోందని పేర్కొన్నారు. ఇప్పటివరకు వసూలు చేసిన ప్రీమియం మొత్తాన్ని తిరిగి చెల్లించి, కార్డులు జారీ చేసి, విధివిధానాలు స్పష్టం చేసిన తర్వాత మాత్రమే కోతలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ పథకాన్ని కోరుకోని ఉద్యోగులకు మినహాయింపు కల్పించాలని, ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైన భార్యాభర్తల విషయంలో ఒకరి జీతం నుంచే ప్రీమియం వసూలు చేయాలని సూచించారు. డిపెండెంట్ల వయోపరిమితిని 25 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలకు పెంచాలని, సీనియర్--జూనియర్ అనే తేడా లేకుండా అందరికీ ఒకే విధమైన ప్రీమియం విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# 6వ స్కాలస్టిక్ హనర్స్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ - కొంతం దీపిక నరేష్

సికింద్రాబాద్ మే 31(వార్త వేదిక సూర్య)



సికింద్రాబాద్ నియోజకవర్గం వెస్ట్ మారేడ్పల్లి జిహెచ్ఎంసి మల్టీపర్పస్ యుటిలిటి హాల్ లో ఆదివారం 6వ స్కాలస్టిక్ హనర్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ పాల్గొన్నారు. అనంతరం మాజీ కార్పొరేటర్ మెరిట్ మార్కులు సాధించిన 20 ప్రభుత్వ పాఠశాలల నుండి 100 మంది విద్యార్థులను ఘనంగా శాలవతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి పలు సూచనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థులందరూ బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు

# బైరాగిగూడా శివసాయి కాలనీల నూతన అధ్యక్షుడిగా బి. రాజారామ్

రాజేంద్రనగర్,మే 31 ( వార్త వేదిక సూర్య ) :

రాజేంద్రనగర్ నియోజకవర్గం గండిపేట్ మండలం బైరాగిగూడాలోని శివసాయి ఫేజ్-1, శివసాయి ఫేజ్-2 కాలనీల నూతన అధ్యక్షుడిగా బి. రాజారామ్ నియామకం కావడంతో కాలనీ వాసులు ఘనంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జీహెచ్ఎంసీ 121, 122, 123 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి చేతుల మీదుగా బి. రాజారామ్‌కు శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్, ఏ-బ్లాక్ అధ్యక్షుడు దప్పు నవీన్ కుమార్, ఎంపీటీసీ భోగాల శ్రీనివాస్, కొరివి గణేష్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన బి. రాజారామ్ కాలనీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీ వాసులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.



# ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను వెంటనే రద్దు చేయాలి

**- 7వ వార్డు మెంబర్ పులిగిల్ల వేముల నాగరాజు**



**వలిగొండ, మే 31 (వార్తా వేదిక సూర్)** : వలిగొండ మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో ఆదివారం ఏడవ వార్డు మెంబర్ వేముల నాగరాజు మాట్లాడుతూ తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలన్నారు. ఇందిరమ్మ కమిటీలు కాంగ్రెస్ పార్టీ నాయకుల వరకు కమిటీలుగా ఏర్పడి వారి వరకు ఇంట్లో అందజేయడం సరైనది కాదన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటి రద్దు చేసి గ్రామసభ ద్వారా సామాన్యులందరికీ ఇండ్లు అందే విధంగా రాజకీయాలు లేకుండా గ్రామసభల్లో ఎంపిక చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగింది. కానీ వారు మాత్రం కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వాళ్లకి వారికి అనుకూలంగా ఉన్నవారికి ఇండ్లు మంజూరు చేయడంలో రాజకీయాలు చేయడం జరుగుతున్నది. రాజకీయాలకు ఎటువంటి తావు లేకుండా గ్రామ సభ ద్వారా అందరికీ ఇండ్లు అందేలా ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో వేముల జ్యోతిబసు పాల్గొన్నారు.

# ఒక శతాబ్దపు సుదీర్ఘ ప్రస్థానం ముగిసింది..

**వందేళ్ల నిండు జీవితాన్ని పూర్తి చేసుకుని బచ్చే రాజమల్లమ్మ (100) కన్నుమూత**



**మోటకొండూరు, మే 31, (వార్తా వేదిక సూర్)** :గ్రామంలో ఒక శతాబ్దపు కాలానికి సాక్షిగా, తరాల గమనాన్ని కళ్లారా చూసిన ఒక పెద్ద దిక్కు దూరమైంది. మోటకొండూరు మండల పరిధిలోని ముత్తి రెడ్డి గూడెం గ్రామానికి చెందిన వృద్ధురాలు బచ్చే రాజమల్లమ్మ (వయస్సు సుమారు 95 నుండి 100 సంవత్సరాలు) ఆదివారం వృద్ధాప్య సమస్యలతో కన్నుమూశారు.రాజమల్లమ్మ దాదాపు ఒక శతాబ్ద కాలం పాటు నిండు నూరేళ్ల ఆయుష్షుతో ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారు. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా అందరితో ఎంతో ఆప్యాయంగా ఉంటూ, ఊరిలో జరిగే అన్ని పరిణామాలను కళ్లారా చూసిన వృద్ధురాలు కావడం చేత ఆమెను గ్రామ ప్రజలందరూ ఆప్యాయంగా 'పెద్దమ్మ' అని పిలుచుకునేవారు. తరాల మార్పును, పల్లెటూరి పరిణామాలను చూసిన ఆమె మరణం పట్ల గ్రామస్థులు తీవ్ర సెంటిమెంట్‌కు లోనవుతున్నారు. ఒక సుదీర్ఘమైన, సంపూర్ణమైన జీవితాన్ని ముగించి అనంత లోకాలకు వెళ్లిన రాజమల్లమ్మ మరణం ఆ కుటుంబానికే కాకుండా, ఇటు గ్రామ ప్రజలకు కూడా తీరని లోటని ఊరి పెద్దలు పేర్కొన్నారు. ఆమె మరణవార్త తెలియగానే గ్రామస్థులు, బంధువులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆమె పార్థివ దేహానికి పూలమాలలు వేసి అశ్రునయనాలతో అంతిమ నివాళులు అర్పించారు.

# మోత్కూరు మున్సిపల్ కమీషనర్‌గా నర్సయ్య నియామాకం



**మోత్కూరు, మే 31 (వార్త వేదిక సూర్య):** మోత్కూరు ఇంచార్జి మున్సిపల్ నూతన కమీషనర్‌గా గోలుకొండ నర్సయ్యను నియమిస్తూ శనివారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నర్సయ్య ఇప్పటివరకు యాదగిరిగుట్ట మున్సిపల్ మేనేజర్‌గా విధులు నిర్వహించారు.ప్రస్తుతం మోత్కూరు మున్సిపల్ కమీషనర్‌గా పనిచేస్తున్న సతీష్ కుమార్‌ను హుజూర్‌నగర్ మున్సిపల్ బదిలీ అయ్యారు.నూతన కమిషనర్‌గా నియమితులైన నర్సయ్య త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

# ప్రధాని మంత్రి మన్ కీ బాత్ వీక్షించిన నాయకులు



**మోత్కూరు: మే 31 ( వార్త వేదిక సూర్య ):** భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ 134వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం మండలంలోని పాలడుగులో బీజేపీ మండల అధ్యక్షుడు గుదే మధుసూదన్ యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పలు విలువైన సందేశాలు అందించారని, నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతనని తెలియజేసినట్లు పేర్కొన్నారు.. వేసవి కాలంలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారని,.సమాజ సేవలో ముందుండే వ్యక్తులు, సంస్థలను అభినందించినట్లు మధుసూదన్ తెలిపారు.

# యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**యాదగిరిగుట్ట మే 31 ( వార్త వేదిక సూర్య )** : కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేసి టెండర్లు వేయాలని కోరుతూ యాదగిరిగుట్ట టౌన్ లో ఎం ఆర్ ఓ కార్యాలయం నుండి పాతగుట్ట చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చి బస్ స్టాండ్ వద్ద మహా ధర్నా నిర్వహించడం జరిగింది. ధర్నా నిర్వహించిన ఆందోళనకారులను పోలీస్ శాఖ అక్కడ నుండి పంపించడం జరిగింది. ఈ కార్యక్రమం లో స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యాక్రమాన్ని ఉద్దేశించి కమిటీ సభ్యులు మాట్లాడుతూ యాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘాన్ని రద్దుచేసి టెండర్ వేయాలని తద్వారా దేవస్థానానికి 20 నుండి 30 కోట్ల ఆదాయము సమకూరుతుందని తద్వారా భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించ వచ్చు అని, స్థానిక నిరుద్యోగులకు ఉ పాధి కల్పించవచ్చునని చెప్పడం జరిగింది. కొండపైన ఉన్నటువంటి 10 తాత్కాలిక దుకాణాలకు గడువు చివరి రోజు కావున ఇప్పటివరకు ఎటువంటి రెన్యువల్ నోటిఫికేషన్ రాలేదు. ఒకవేళ టెండర్ వేయకుండా రెన్యువల్ చేసినట్లయితే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని మరియు ఆమరణ నిరాహార దీక్ష కైనా కమిటీ సభ్యులు పూనుకుంటామని, ఆ దేవుని ఆదాయం కోసం ఎక్కడి వరకైనా వెళ్తామని కమిటీ సభ్యులు చెప్పడం జరిగింది.

ఇట్టి కార్యక్రమం లో కాటబత్తిని ఆంజనేయులు, పల్లపు బాలయ్య, బండ రామస్వామి, దేవపూజ అశోక్, గ్యాదపాక బాల నరసయ్య, బుగ్గా ఆంజనేయులు, అరె స్వామి, మాటూరి బాలయ్య, దండబోయిన వీరేష్, బండి అనిల్, ముక్కెర్ల వెంకటేష్, కొన్నె సంజీవ , గోపగాని ప్రసాద్, దొమ్మాట ప్రభాకర్, మందోజు నరేష్, కర్రె ప్రవీణ్ , గుండు కుమార్, వాల్మీకి అజయ్, గ్యాదపాక క్రాంతి, గౌడ శ్రీశైలం, పసుపునేటి మురళి, కంబాల



సత్యం, ముక్కెర్ల పెద్ద రాజు, రాజశేఖర్, బండ శేఖర్, శ్రీనాథ్, నరేష్, విజయ్, రమేష్, నవీన్, ప్రవీణ్, సాయి, మణి తదితరులు పాల్గొన్నారు

# ఉద్యమకారుల సమావేశానికి తరలిన వెళ్లిన ఉద్యమ నాయకులు

**రామన్నపేట ( వార్త వేదిక సూర్య )**

ఆదివారం హైదరాబాదులో జరిగిన బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటుచేసిన తెలంగాణ ఉ ద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రతినిధుల సమావేశానికి రామన్నపేట మండలం తెలంగాణ ఉద్యమకారులు రాష్ట్ర మైనార్టీల అధ్యక్షులు ఎస్కే చాంద్ ఆధ్వర్యంలో రామన్నపేట నుంచి తరలి వెళ్ళినారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నోముల శంకర్ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు ఎండి ఇమామ్ రాష్ట్ర నాయకులు గడ్డం యాదగిరి నాయకులు కొండ మల్లేశం కైరం కొండ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి మంత్రివర్గంలో అవకాశం ఇవ్వాలి

**యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు సందీప్ రెడ్డి**

**మోత్కూరు, (అడ్డగూడూరు): మే 31 (వార్తా వేదిక సూర్య ):** ప్రజా సమస్యలపై ప్రతినిత్యం పోరాడుతూ,కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న బడుగుల ఆశాజ్యోతి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి రాష్ట్ర మంత్రివర్గంలో అవకాశం ఇవ్వాలని అడ్డగూడూరు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బైరెడ్డి సందీప్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా పైగా కాంగ్రెస్ పార్టీలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించినప్పటి నుండి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజానాయకుడిగా ఎదిగారని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామస్థాయి సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో తెలంగాణ రాష్ట్రంలోనే రాజగోపాల్ రెడ్డి మొదటి నాయకుడని, అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలు, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం ప్రజల్లోకి తీసుకెళ్లడంలో రాజగోపాల్ రెడ్డి కీలక పాత్ర పోషిస్తున్నాడని తెలిపారు. బిఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై ధైర్యంగా గళమెత్తిన నాయకుడిగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేక గుర్తింపు ఉ ఒదన్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ యువతకు చేరువైన నాయకుడిగా రాష్ట్రవ్యాప్తంగా మంచి గుర్తింపు పొందారని పేర్కొన్నారు. అలాంటి నాయకుడిని తెలంగాణ మంత్రిగా నియమిస్తే కాంగ్రెస్



# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్యులపై ప్రభావం

**మోత్కూరు : మే 31 ( వార్త వేదిక సూర్య):**

దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో సామాన్య ప్రజల జీవితంపై తీవ్రంగా ప్రభావితమవుతోందని సామాజిక కార్యకర్త మహమ్మద్ షాకీరుద్దీన్ అన్నారు.ఆయన ఆదివారం మోత్కూరులో విలేకరులతో మాట్లాడుతూ దేశంలోని అనేక ప్రాంతాలల్లో రూ.126 దాటిందని, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాల వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. పెట్రోల్ ధరల పెరుగుదల కారణంగా కేవలం వాహనదారులే కాకుండా మధ్యతరగతి, పేద కుటుంబాలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు.పశ్చిమ బెంగాల్, అస్సాం, మణిపూర్, తమిళనాడు వంటి రాష్ట్రాల ఎన్నికల సమయంలో పెట్రోల్ ధరలను పెంచమని ప్రజలకు హామీలు ఇచ్చిన భాజపా నాయకులు, ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలను అమాంతం పెంచి సామాన్యులపై భారాన్ని మోపారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజల మద్దతు కోసం హామీలు ఇవ్వడం, అనంతరం ధరలు పెంచడం ద్వారా రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తక్కువగా ఉన్న సమయంలో సరైన స్థాయిలో నిల్వలు పెంచుకోవడం, తక్కువ ధరలకు దిగుమతులపై దృష్టి పెట్టడం వంటి అంశాల్లో ప్రభుత్వం ముందుచూపు ప్రదర్శించలేదన్నారు.రష్యా నుంచి తక్కువ ధరలకు చమురు దిగుమతుల అవకాశాలు ఉ న్నప్పటికీ వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించిందన్నారు. దాని ఫలితంగా ప్రస్తుతం ఇంధన ధరలు భారీగా పెరిగి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందన్నారు.

ఇంధన ధరల పెరుగుదల ప్రభావం కేవలం పెట్రోల్ బంకుల వరకే పరిమితం కాకుండా బస్ ఛార్జీలు, రవాణా ఖర్చులు, కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. దీంతో సామాన్య ప్రజలు, మధ్యతరగతి కుటుంబాలు బతకలేని పరిస్థితికి చేరుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాల్సిన కేంద్ర ప్రభుత్వం ప్రచార రాజకీయాలకే పరిమితమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పెంచిన పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరలు తగ్గించాలని షాకీరుద్దీన్ డిమాండ్ చేశారు.



# మరణించిన పూర్వ విద్యార్థులకు ఆర్థిక సహాయం చేసి ఆదర్శంగా నిలిచిన పూర్వ విద్యార్థులు

**పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం**

**పూర్వ జ్ఞాపకాలను నెమరు వేసుకున్న పూర్వ విద్యార్థులు**

**35 సంవత్సరాల తర్వాత కలిసిన 89-90 బ్యాచ్ పూర్వ విద్యార్థులు**

**పూర్వ విద్యార్థుల సమ్మేళనం పట్ల సంతోషం వ్యక్తం చేసిన రావిరాల పదవ తరగతి విద్యార్థులు**

**ఒకరి నొకరు కలిసి చేదు తీపి జ్ఞాపకాలను**

**నెమరు వేసుకున్న రావిరాల పూర్వ విద్యార్థులు**

**మహేశ్వరం, మే 31, వార్త వేదిక సూర్య**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ జిహెచ్ఎంసి రావిరాల గ్రామంలో 1989-90 బ్యాచ్ రావిరాల ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు 35 సంవత్సరాల తర్వాత కుటుంబ సభ్యులతో సహా అందరూ కలిసి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించుకున్నారు. ఆదివారం నాడు కల్వకోల్ లక్ష్మీ దేవమ్మ ఫంక్షన్ హాల్ లో ఘనంగా రావిరాల గ్రామం ప్రాథమిక తో పాఠశాలలో పదవ తరగతి చదివిన 1989- 90 బ్యాచ్ చెందిన పూర్వ విద్యార్థులు 35 సంవత్సరాల తర్వాత విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో సహా సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులందరూ కలుసుకొని తమ జ్ఞాపకాలను నెంబరు వేసుకున్నారు. 35 సంవత్సరాల తర్వాత కలవడం చాలా సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇన్ని సంవత్సరాల తర్వాత మేము కలుస్తామని అనుకోలేదని తమ అభిప్రాయాన్ని పూర్వ విద్యార్థులు వ్యక్తం చేశారు. 35 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులందరం కుటుంబ సభ్యులతో సహా పిల్లలతో కలిసి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకోవడం చాలా సంతోషం ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు అందరూ కలిసి మరణించిన తమ విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక సహాయంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించారు. సేవ కార్యక్రమాలు నిర్వహించి 1989-90 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అందరికీ ఆదర్శంగా నిలిచారు.



యాదాద్రి భువనగిరి
సంపుటి : 2 సంచిక : 12
వార్త వేదిక సూర్య
యాదాద్రి భువనగిరి ॥ సోమవారం, జూన్, 1, 2026 ॥

# ఐఐఐటీ బాసరలో సీట్ సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్ ఉదయశ్రీ



**వలిగొండ: మే 31 ( వార్తావేదిక సూర్య ) :**వలిగొండ మండలంలోని లోతుకుంట మోడల్ స్కూల్ విద్యార్థిని, ఎన్‌సీసీ క్యాడెట్ పి. ఉదయశ్రీ ఐఐఐటీ బాసర ప్రథమ దశ ప్రవేశ ఫలితాలలో ఎన్‌సీసీ కోటా ద్వారా సీటు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డా. సీతారామరాజు తెలిపారు.పాఠశాలలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు మానసిక, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులు విద్యా రంగంలో కూడా విశేష ప్రతిభ కనబరు-స్తున్నారని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం ఆసక్తి గల విద్యార్థులు నేరుగా కళాశాలను సంప్రదించాలని కోరారు.అలాగే, 6వ తరగతి ప్రవేశాల కోసం మోడల్ స్కూల్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులు 8వ తరగతి నుండి ఎన్‌సీసీలో చేరేందుకు అర్హులవుతారని, ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా పి. ఉ దయశ్రీని పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ అధికారులు, తల్లిదండ్రులు అభినందించారు.

# కంఠమహేశ్వర స్వామికి బోనాలు



**మోత్కూరు, మే 31 (వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని బిక్కేరు వాగు వెంట ఉన్న శ్రీ కంఠమహేశ్వర స్వామి కళ్యాణోత్సవలో భాగంగా శనివారం రాత్రి కంఠమహేశ్వర స్వామికి గౌడ కులస్తులు బోనాలను సమర్పించారు. అనంతరం ఆదివారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ కులస్తులు బుర్ర కృష్ణ, లోడే యాదగిరి, సుదగాని కిష్టయ్య, బుర్ర శ్రీనివాస్ గౌడ్, డబ్బేటి సోంబాబు,బత్తిని శ్రీనివాస్, గనగాని చంద్రయ్య బుర్ర సందీప్ కానుగు రాజు, బుర్ర వెంకన్న రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# త్రిబుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక



**మోత్కూరు, మే 31 ( వార్త వేదిక సూర్య):** త్రిబుల్ ఐటీ ప్రవేశ ఫలితాలలో మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కొక్కుల ఉషశ్రీ త్రిబుల్ ఐటీ బాసరకు ఎంపిక కావడం అభినందనీయమని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవినేని అరవిందరాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉషశ్రీ 564 మార్కులతో మండలంలోని ప్రథమ ర్యాంక్ సాధించి ప్రభుత్వ పాఠశాల ప్రతిష్టను పెంచిందని అన్నారు. భవిష్యత్ లో ఇంకా ఉన్నత స్థానాలు పొంది సమాజాభివృద్ధిలో తన వంతు పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.ఈ విజయం పాఠశాల ఉపాధ్యాయుల పనితీరుకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలియజేసింది.

# మృతుడి కుటుంబానికి 25 కేజీల బియ్యం అందజేత



**మోత్కూరు: మే 31 ( వార్తా వేదిక సూర్య ):** మండలంలోని పాలడుగు గ్రామానికి చెందిన ఎడ్ల శేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. శేఖర్ ఆకాల మృతికి ఆ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు మోత్కూర్ గోపాల్ , కొంపెల్లి కేదారి రాజరత్నం లు ఎడ్ల శేఖర్ కుటుంబసభ్యులకు 25 కేజీల బియ్యాన్ని ఆదివారం అందజేశారు.




# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**రామన్నపేట, మే 31 ( వార్త వేదిక సూర్య):** రామన్నపేట మండలంలోని లక్ష్మాపురం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1998- 99 ఏడవ తరగతి బ్యాచ్కు చెందిన పూర్వ విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులు వెంకటేశ్వర్, ఆంజనేయులు లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కాటమరాజు, బత్తిని ఆంజనేయులు, ముక్కాముల స్వామి యాదవ్, బొడిగె ఆంజనేయులు, చెరుకు మురళి, జె కుమార్, వరలక్ష్మి, శోభ, లక్ష్మి, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు

# స్వామినాదన్ కమిషన్ సిపారసులను అమలు చేయాలి



**మోత్కూరు, మే 31 ( వార్త వేదిక సూర్య):** కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వరి మద్దతు ధరలను తక్షణమే ఉపసంహరించుకొని, స్వామినాదన్ కమిషన్ చేసిన సిపారసుల మేరకు పంటలకు మద్దతు ధర ప్రకటించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఒక కోటి 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు పండిస్తే కేంద్ర ప్రభుత్వం కేవలం 53 లక్షలు మాత్రమే కొనుగోలు చేస్తామనడం, ప్రైవేట్ దళారి దోపిడీని ప్రోత్సహించే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సరియైన కొనుగోలు వ్యవస్థ లేకపోవడం వల్ల నష్టపోతున్నారని అన్నారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం ఎరువుల ఫర్టిలైజర్ల ధరలు పెంచి, మరోవైపు పంటలకు నామమాత్రపు మద్దతు ధర ప్రకటించడం దారుణమన్నారు. స్వామినాదన్ కమిషన్ సిపారసుల మేరకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే వరి దాన్యానికి క్వింటాలుకు రూ.3500 మద్దతు ధర ప్రకటించాలని, లేని యెడల రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులను ఐక్యంచేసి కేంద్ర ప్రభుత్వంపై పోరుబాట తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి దడిపల్లి ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొల్లు యాదగిరి, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు, నాయకులు కురిమేటి యాదయ్య, పానుగుల రమేష్, పిట్టల చంద్రయ్య, కందుకూరి నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# 60 ఫీట్లు వద్దు.. 30 ఫీట్ల రోడ్డుకైతే స్వచ్ఛందంగా సహకరిస్తాం!

- మొండివైఖరితో ముందుకెళ్తే ప్రాణాలనైనా అడ్డువేస్తాం
- రోడ్డు విస్తరణ బాధితుల హెచ్చరిక



**భువనగిరి, మే 31 (వార్త వేధిక సూర్య ):-** పట్టణాభివృద్ధికి గానీ, రోడ్డు విస్తరణకు గానీ తాము ఏమాత్రం వ్యతిరేకం కాదని.. ప్రస్తుతం 15 ఫీట్లుగా ఉన్న రోడ్డును 30 ఫీట్లకు విస్తరిస్తే స్వచ్ఛందంగా సహకరిస్తామని హైదరాబాద్ చౌరస్తా టు నల్గొండ చౌరస్తా రోడ్డు విస్తరణ బాధితులు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక భగయత్ స్కూల్ ఆవరణలో రోడ్డు విస్తరణ బాధితులంతా అత్యవసరంగా సమావేశమై తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితులు మరియు సంఘం నాయకులు మాట్లాడుతూ.. రోజుకు పట్టుమని పది పెద్ద వాహనాలు కూడా తిరగని ఈ రోడ్డును 60 ఫీట్లకు విస్తరించడం ఎవరి స్వార్థం కోసమని అధికారులను, పాలకులను ప్రశ్నించారు. కొంతమంది నేతలు ప్రజల క్షేమం కోసమే విస్తరణ అంటూ కల్లబొల్లి మాటలు చెబుతున్నారని మండిపడ్డారు. దశాబ్దాల కాలంగా, తాత ముత్తాతల నాటి నుండి చిన్నచిన్న గృహాల్లో నివసిస్తున్న నిరుపేదలను రోడ్డుపాలు చేయడం అభివృద్ధి ఎలా అవుతుందని వారు నిలదీశారు. ప్రతిరోజు వందలాది బస్సులు, లారీలు తిరుగుతున్న నల్గొండ ప్రధాన రహదారిని విస్తరించడంలో పాలకులకు, అధికారులకు చిత్తశుద్ధి లేదు కానీ, ఎలాంటి ప్రాముఖ్యత లేని ఈ లోకల్ రోడ్డు పనులను ఆగమేఘాల మీద ప్రారంభించడంలో ఆంతర్యం ఏమిటని ఆరోపించారు.పాలకులు ఇకనైనా తమ మొండివైఖరిని వీడి, నివాసితుల అభిప్రాయం మేరకు ఈ రోడ్డును 60 ఫీట్లకు కాకుండా 30 ఫీట్లకు మాత్రమే విస్తరించాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. అలాగే, 30 ఫీట్ల విస్తరణలో ఇండ్లు, స్థలాలు కోల్పోయే బాధితులకు ప్రభుత్వం అండగా నిలిచి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, తగిన ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా ప్రజల అభిప్రాయానికి విరుద్ధంగా బలవంతంగా ఇండ్లు కూల్చాలని చూస్తే తమ ప్రాణాలను అడ్డొడ్డైనా పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు.ఈ నిరసన సమావేశంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాయ దశరథ, దర్గాయి జాంగిర్, కుమార్, గాయపాక పృథ్వీరాజ్, బెండ కిరణ్, బెండ ఆంజనేయులు, గాయపాక స్వామి, ఆంథోని రాజ్, గాయపాక పరమేష్, అడ్వకేట్ వేణు, నవీన్, వెంకటేష్, చందన మెడికల్ షాప్ మాయ శ్రీధర్.. మరియు మహిళలు రజిత, అండాలు, గాయపాక లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన సమాజం

**మోత్కూరు ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు**



**మోత్కూరు మే 31 ( వార్తా వేదిక సూర్య ):**పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉందని మోత్కూర్ పోలీస్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సిగరెట్లు, బీడీలు, గుట్కా, ఖైనీ, పాన్ మసాలా వంటి పొగాకు ఉత్పత్తుల వినియోగం ప్రస్తుతం సమాజంలో ఆందోళనకర స్థాయికి చేరుకుందని అన్నారు. వీటి వినియోగం వల్ల నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండె జబ్బులు, రక్తపోటు, శ్వాసకోశ వ్యాధులు వంటి అనేక ప్రమాదకర ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. పొగాకు సేవించే వ్యక్తులు మాత్రమే కాకుండా వారి చుట్టూ ఉండే కుటుంబ సభ్యులు కూడా పరోక్షంగా ఆరోగ్య సమస్యలకు గురవుతారని పేర్కొన్నారు. ప్రధానంగా యువతలో పొగాకు ఉత్పత్తుల వినియోగం పెరుగుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని అన్నారు. స్నేహితుల ప్రభావం,తప్పుడు ప్రచారాల తో యువకులు వ్యసనాలకు బానిసలవుతున్నారని చెప్పారు. ఒకసారి వ్యసనం అలవాటైతే దాని నుంచి బయటపడటం చాలా కష్టమని, అందువల్ల ప్రారంభ దశలోనే వాటికి దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, క్రీడలు, విద్య, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యమనే విషయాన్ని గుర్తుంచుకొని వ్యసనాలకు బానిస కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవార్చుకోవాలని పిలుపునిచ్చారు.




Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305,** Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**